VELTHURU TELUGU DAILAY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
ఆదివారం 17.05.2026
సంపుటి: 07 సంచిక: 343
పేజీలు: 12 వెల: రూ. 5/
Velthuru Newspaper
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH



## లంచ్ బాక్స్‌తో సచివాలయానికి..

సాధారణ ఉద్యోగిలా సీఎం విజయ్ సరికొత్త పంథా!
సమయపాలనతో ఆకట్టుకుంటున్న సీఎం

2

# డిజిటల్ చెల్లింపుల్లో అగ్రగామి భారత్

- నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- ది హేగ్ వేదికగా ప్రవాస భారతీయులతో ముచ్చట్లు
- దేశంలో పండుగ గుర్తొచ్చిందన్న ప్రధాని మోదీ
- డచ్ ఆర్థిక వ్యవస్థకు భారతీయుల సేవలపై ప్రశంసలు
- కరోనా, యుద్ధాలు, ఇంధన సంక్షోభాలపై తీవ్ర ఆందోళన
- భారత్-నెదర్లాండ్స్ సప్లై చైన్‌ను నిర్మిస్తాయని వెల్లడి
- భారత్ నెలకు 20 బిలియన్ డాలర్ల లావాదేవీలు డిజిటల్
- త్వరలోనే ప్రపంచ మార్కెట్లలో 'మేడ్ ఇన్ ఇండియా' సెమీకండక్టర్ చిప్‌లు

నెదర్లాండ్స్ వెలుతురు మే 16:

నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దేశంలోని 'ది హేగ్' నగరంలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత దేశ ప్రగతి ప్రస్థానం, ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, భారత్‌నెదర్లాండ్స్ మధ్య ఉన్న దౌత్య సంబంధాలపై ఆయన ఎంతో కీలకమైన ప్రసంగం చేశారు. సభా ప్రాంగణానికి చేరుకున్న ప్రధానికి అక్కడ స్థిరపడిన భారతీయులు ఘన స్వాగతం పలికారు. ప్రవాస భారతీయులలో కనిపించిన ఉత్సాహాన్ని చూస్తుంటే తాను భారతదేశంలోని ఏదో ఒక పెద్ద పండుగలో పాల్గొన్నట్లుగా

..మిగతా 2లో





# తెలంగాణలో పాతికేళ్ల తర్వాత 'సర్' విప్లవం

- జూన్ 25 నుంచి ఇంటింటికీ ఓటర్ల సర్వే
- కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల.
- బోగస్, అనర్హుల ఓట్లకు శాశ్వతంగా చెక్
- అర్హులందరికీ చోటు కల్పించడమే ప్రధాన లక్ష్యం.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా 2002లో జరిగిన ప్రక్రియ
- 25 ఏళ్ల తర్వాత తెలంగాణలో తొలిసారి

2



## తెలంగాణలో కొత్త పోలీసింగ్!"

- "డ్రగ్స్‌పై వార్ ప్రకటించిన డీజీపీ "
- "అవినీతి పోలీసులకు వార్నింగ్!"
- "సైబర్ నేరాలపై బిగ్ అలర్ట్"
- "ఫ్రెండ్లీ + స్ట్రాంగ్ పోలీసింగ్"
- "సీవీ ఆనంద్ సెన్సేషనల్ కామెంట్స్"
- తెలంగాణలో ఇకపై ఎఫెక్టివ్ పోలీసింగ్
- ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి : డీజీపీ సీవీ ఆనంద్
- రాష్ట్రంలో డ్రగ్స్‌పై యుద్ధం తరహాలో చర్యలు
- ప్రతి స్కూల్, కాలేజీలో యాంటీ డ్రగ్ కమిటీలు
- అడ్మిషన్ సమయంలో పేరెంట్స్ నుంచి అండర్‌టేకింగ్ తప్పనిసరి
- డ్రగ్స్ కేసులు జరిగితే విద్యాసంస్థలదే బాధ్యత
- 75 వేల మంది పోలీసులకు హెల్త్ మానిటరింగ్ యాప్
- ట్రాఫిక్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక రోడ్ సేఫ్టీ బ్యూరో
- వెనుక సీట్లో కూర్చున్న వారికీ సీట్ బెల్ట్ తప్పనిసరి
- సైబర్ నేరాలు రాష్ట్రానికి పెద్ద సవాల్ : డీజీపీ
- మహిళా పోలీసు అధికారులకు ప్రాధాన్యం పెంచిన శాఖ
- సేవాభావం ఉన్నవారే పోలీస్ ఉద్యోగాల్లోకి రావాలి
- అవినీతి చేస్తే ఏసీబీ ట్రాప్ తప్పదని హెచ్చరిక
- రౌడీషీటర్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం
- చట్టబద్ధంగా పనిచేసే పోలీసులకు పూర్తి అండగా ఉంటానన్న డీజీపీ.



# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

సామాన్యులపై భారం మోపొద్దంటూ కేంద్రానికి డిమాండ్

పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సమర్థనీయం కాదన్న రేవంత్ రెడ్డి

కేంద్ర నిర్ణయంతో నిత్యావసరాల ధరలు మరింత పెరుగుతాయని ఆందోళన

మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలపై తీవ్ర విమర్శలు

ఆత్మనిర్భర్ భారత్ నినాదం ఫలితాలు ఇవ్వలేదని వ్యాఖ్యలు

చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆరోపణ

యువతకు ఉపాధి హామీ లేని పరిస్థితి నెలకొందన్న రేవంత్

రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ అమలు కాలేదని విమర్శ

రూపాయి విలువ పతనం మోదీ పాలన వైఫల్యమని వ్యాఖ్య

హైదరాబాద్ వెలుతురు మే 16:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ధరల పెంపు వల్ల అనేక రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులపై భారీ భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి.. మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని విమర్శించారు. 'ఆత్మనిర్భర్ భారత్' కేవలం ఓట్లు రాబట్టే నినాదంగానే మిగిలిపోయిందని, ఫలితాలు తీసుకురాలేకపోయిందని వ్యాఖ్యానించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, యువతకు ఉపాధిపై భరోసా లేకుండా పోయిందన్నారు. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. గత పదేళ్లుగా రూపాయి విలువ నిరంతరం పడిపోతూ వస్తోందని, ప్రస్తుతం ఆ పరిస్థితి మరింత తీవ్రమైందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇరాన్‌ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం సామాన్యుల నడ్డి విరిచే చర్యగా అభివర్ణించారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం.. ఇలాంటి ధరల పెంపును ఎలా సమర్థించుకుంటుందని రేవంత్ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు

..మిగతా 2లో





## రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

- స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం: సీఎం చంద్రబాబు
- నాలుగు రోజుల పాటు ముమ్మరంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' డ్రైవ్‌లు
- చెత్తను వదిలించుకుందాం.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిద్దాం

2

## ఆర్‌జీ కర్ ఘటనపై బంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం




- ముగ్గురు ఐపీఎస్ అధికారులపై వేటు
- హత్యాచార కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం
- ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారుల సస్పెండ్
- ఘటనపై ముఖ్యమంత్రి సువేందు అధికారి సీరియస్

2



## "సత్యమేవ జయతే"

- మా అబ్బాయి బండి భగీరథ్ పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో చట్టంపైనున్న గౌరవంతో శనివారం రోజున అడ్వోకేట్ల ద్వారా పోలీసుల విచారణ కోసం అప్పగించాను.
- నేను ఇంతకు ముందే చెప్పిన. చట్టం ముందు నా బిడ్డైనా, సామాన్యుడైనా సమానమే
- అందరం చట్టానికి లోబడి ఉండాల్సిందే.
- మా అబ్బాయి ఏ తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడు.
- వాస్తవానికి ఫిర్యాదు రాగానే ఆయనను స్టేషన్ లో అప్పగిద్దామనుకున్నా
- లాయర్లను సంప్రదించి మా వద్ద ఉన్న ఆధారాలను వారి ముందుంచాడు
- వాటిని చూసి కేసు కొట్టేస్తారని, బెయిల్ తప్పకుండా వస్తుందని లాయర్లు చెప్పారు.
- అందుకే కొంత జాప్యం జరిగింది
- శనివారం రోజున కూడా బెయిల్ వస్తుందనే లాయర్లు చెబుతున్నారు
- అయితే ఇంకా జాప్యం చేయడం సరికాదనే ఉద్దేశంతో నేను మా అబ్బాయిని తీసుకొచ్చి పోలీసులకు లాయర్ల ద్వారా విచారణ కోసం అప్పగించాను
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



## ఇందిరమ్మ ఇండ్లకు కేంద్రవాటా కోసం ఎదురు చూస్తున్నాం

2

కేంద్రం ఇవ్వకపోతే మేమే భరిస్తాం

1520 రోజుల తర్వాత ఇండ్లకు ఆపిన మొత్తాన్ని విడుదల చేస్తాం

జూన్ 2న రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ప్రారంభం

ఈనెల చివరిలోగా భూముల విలువలు సవరణ

రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## తైవాన్‌పై డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

చైనా సైనిక శక్తి ముందు తైవాన్ చాలా చిన్నదన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

యుద్ధం వస్తే తొమ్మిదిన్నర వేల మైళ్ల దూరం ప్రయాణించి రావడం అమెరికాకు సాధ్యం కాదు



2



2

## బీజేపీ వీరనారీ మనులు ఎక్కడ?

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ పరారీలో ఉన్నాడన్న ఆరోపణలపై కాంగ్రెస్ నేతల ప్రశ్నలు
- "బేటీ బచావో, బేటీ పడావో" అంటూ మాట్లాడే బీజేపీ మహిళా నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారని విమర్శ

## మొక్కజొన్న కొనుగోళ్లలో వేగం పెంచాలి: తుమ్మల

- కేంద్రం కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్లతో మొక్కజొన్న సేకరణ చేపట్టింది
- జొన్న కొనుగోలుకు రూ.1100 కోట్లతో ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- మొక్కజొన్న, జొన్నలను వెంటనే పీఎస్ఎస్ (PSS) పరిధిలోకి తీసుకురావాలి



2

## లంచ్ బాక్స్‌తో సచివాలయానికి..

చెన్నై వెలుతురు మే 16:

తమిళనాడు రాజకీయాల్లో చారిత్రక విజయం సాధించి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నటుడు సి. జోసెఫ్ విజయ్, తన విలక్షణమైన పనితీరుతో వార్తల్లో నిలుస్తున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచే ఆయన అనుసరిస్తున్న క్రమశిక్షణ, సమయపాలన రాష్ట్ర అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఓ సాధారణ ప్రభుత్వ ఉద్యోగి మాదిరిగా ఆయన వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. మే 10న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ ప్రతిరోజూ నిర్దేశిత సమయానికి పావుగంట ముందే చెన్నైలోని సెయింట్ జార్జ్ కోటలో ఉన్న సచివాలయానికి చేరుకుంటున్నారు. ఇంటి నుంచి స్వయంగా లంచ్ బాక్స్ తెచ్చుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. భోజన విరామ సమయంలో కూడా తన ఛాంబర్‌కే పరిమితమై, భోజనం ముగించి వెంటనే తిరిగి విధుల్లో నిమగ్నమవుతున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

**(మొదటి పేజీ తరువాయి)**

పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచబోమని కేంద్ర ప్రభుత్వం పదేపదే ప్రకటించిందని గుర్తుచేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన పది రోజులు కూడా గడవకముందే రూ.3కు పైగా ధరలు పెంచడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మోదీ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందనే భావన ప్రజల్లో బలపడుతోందన్నారు. ఇది ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమేనని వ్యాఖ్యానించారు.పెట్రోల్, డీజిల్ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇండ్లకు కేంద్రవాటా కోసం ఎదురు చూస్తున్నాం

హైదరాబాద్ వెలుతురు మే 16:

రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కేంద్ర ప్రభుత్వ వాటాగా రావలసిన నిధుల కోసం ఈ ఏడాది మార్చి నుంచి ఎదురుచూస్తున్నామని, కేంద్రం ఒక్కో ఇంటికి సుమారు 1లక్షా13 వేల రూపాయిల వాటా విడుదల కావాల్సి ఉందని కేంద్రం నుంచి నిధుల వస్తాయన్న నమ్మకంతో ఇందిరమ్మ లబ్దిదారులకు ఫైనల్ బిల్ ఆపడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతానికి ఒక ఇల్లు కూడా మంజూరు కాలేదని తెలిపారు. శనివారం నాడు తన ఛాంబర్‌లో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం పలుమార్లు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారితో పాటు తాను కూడా ప్రాతినిధ్యం చేశామని చెప్పారు. ఆ నిధుల విడుదల కోసం ప్రయత్నిస్తూ మరోవైపు ప్రస్తుతం పూర్తయిన ఒక్కో ఇంటికి 1.60 లక్షల రూపాయిలను తాత్కాలికంగా ఆపామని , ఒకవేళ కేంద్రం మరో 15 20 రోజుల్లోగా విడుదల చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే భరించి లబ్దిదారులకు నిధులు అందజేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొలివిడత మూడున్నర లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా ఇంతవరకు సుమారు 1.32 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని, జూన్ నెలాఖరుకల్లా 6872 వేల ఇండ్లు శ్లాబ్‌ల నిర్మాణం పూర్తవుతుందన్నారు.రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. 2వ విడత మంజూరులో వివిధ రకాల వెసులుబాట్లను కల్పిస్తామని అన్నారు. గోడలు, బేస్‌మెంట్ లెవెల్, శ్లాబ్ వరకు ఉన్న గోడలు, శ్లాబ్ లేని ఇండ్లకు కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఒక్కో నియోజకవర్గానికి ఎన్ని ఇండ్లు మంజూరు చేయాలనే అంశాన్ని కూడా ఈనెల 21న క్యాబినెట్‌లో చర్చించి ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

## తైవాన్‌పై డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

అమెరికా వెలుతురు మే 16:

తైవాన్ విషయంలో అంతర్జాతీయ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. చైనా పర్యటనను ముగించుకుని వాషింగ్టన్ తిరిగొచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తైవాన్ దేశాన్ని ఉద్దేశించి అత్యంత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజింగ్ పర్యటన ముగిసిన తర్వాత ప్రముఖ వార్తా సంస్థ 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. చైనా వంటి మహా శక్తిమంతమైన దేశం ముందు తైవాన్ చాలా చిన్న ద్వీపమని, అనవసరంగా స్వాతంత్ర్యం కోసం ప్రయత్నించి ఆ దేశం పెద్ద ప్రమాదాన్ని కొనితెచ్చుకోవద్దని ఆయన హెచ్చరించారు. ఒకవేళ యుద్ధం అంటూ వస్తే అంత దూరం వచ్చి తైవాన్‌ను రక్షించడం అమెరికా వల్ల కాదనే అర్థం వచ్చేలా ఆయన మాట్లాడటం ఇప్పుడు ప్రపంచ దేశాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

## మొక్కజొన్న కొనుగోళ్లలో వేగం పెంచాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్ వెలుతురు మే 16:

రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేసి,రైతులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వ సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, రవాణా ఏర్పాట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రైతుల నుండి 9.57 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా, ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రప్రభుత్వం స్వంత నిధులతో రూ.4,000 కోట్ల వ్యయంతో మొక్కజొన్న కొనుగోలు చేపట్టిందన్నారు. అదే విధంగా,రాష్ట్రంలో సాగవుతున్న జొన్న పంటను కూడా రూ.1,000 కోట్లతో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. సేకరించిన మొక్కజొన్న నిల్వ కోసం మొత్తం 15.07 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు అవసరమవుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11.40 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే అందుబాటులో ఉందని, దీంతో ఇంకా 3.29 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యం అత్యవసరంగా అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు అదనపు గోదాములను వెంటనే గుర్తించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం మొత్తం 3 కోట్ల గన్ని బ్యాగులు అవసరమవుతుండగా, ఇప్పటివరకు 2 కోట్ల గన్ని బ్యాగులు సరఫరా చేసినట్లు తెలిపారు. మిగిలిన ఒక కోటి గన్ని బ్యాగులు వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అప్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల కొరత లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన పంటను ఆలస్యం లేకుండా బరువు తూచి, గోదాములకు తరలించేందుకు తగిన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి గోదాములకు పంట తరలింపులో ఎటువంటి ఆటంకాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు సూచించారు. మొక్కజొన్న, జొన్న పంటలను కేంద్ర ప్రభుత్వ ధర మద్దతు పథకం (Price Support Scheme PSS) పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం పీఎస్ఎస్ పరిధిలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలుపై అమలులో ఉన్న 25 శాతం సీలింగ్‌ను వెంటనే 50 శాతానికి పెంచాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ మంత్రికి మరోసారి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర రైతుల సమస్యలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి, శనగ, పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని 50 శాతానికి పెంచించడంతో పాటు, మొక్కజొన్న, జొన్నలను పీఎస్ఎస్‌లో చేర్చేలా కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

అమరావతి వెలుతురు మే 16:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, సుసంపన్నంగా మార్చేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు నుంచే 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ కీలక నిర్ణయాలను వెల్లడించారు. అన్ని ప్రాంతాల్లో రాబోయే నాలుగు రోజుల పాటు ఈ క్లీన్ స్వీప్ డ్రైవ్ చాలా ముమ్మరంగా సాగుతుందని, ఆ తర్వాత కలెక్టర్ల పర్యవేక్షణలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని సీఎం స్పష్టం చేశారు. ప్రతిరోజు తప్పనిసరిగా క్లీన్ డ్రైవ్‌లు నిర్వహించి వీధులు, ఊర్లను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**ఆలోచనలు మారాలి.. అప్పుడే సమాజం మారుతుంది**

మన చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉండాలంటే ముందుగా మన ఆలోచనల్లో మార్పు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. "మనం స్వచ్ఛమైన ఆలోచనలు చేసినప్పుడే సమాజానికి మేలు జరుగుతుంది. ప్రజల అలవాట్లు మారాలి, అప్పుడే రాష్ట్రం మారుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచడమే తన ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఒకప్పుడు తాను చేసిన పాదయాత్రల సమయంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారమే కనిపించేదని, ఆ పరిస్థితిని మార్చడానికే చెత్త నుంచి సంపద సృష్టించేలా పార్కులను అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అందరూ స్వచ్ఛందంగా నిషేధించాలని కోరారు. స్వచ్ఛతలో కుప్పం మండలం మూడో బహుమతి సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, శ్రమించిన అందరినీ అభినందించారు.

**సంపద సృష్టి.. పేదలకు పంపిణీ**

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం సంపదను సృష్టించి, ఆ సంపదను పేద ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో పంచాలని తాము భావిస్తున్నట్లు తెలిపారు. గత 16 నెలలుగా స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయం పై సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్‌ను వాడుకోవాలని సూచించారు. అలాగే వ్యర్థాల నుంచి కరెంటును ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 31.33 శాతం ఉన్న అటవీ సంపదను మరింతగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**అర్హులందరికీ గౌరవంగా పింఛన్లు**

తన రాజకీయ జీవితంలో పేదల సేవకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని సీఎం చంద్రబాబు భావోద్వేగంతో చెప్పారు. "నేను ఎక్కడున్నా, నా మనసంతా పేద ప్రజల బాగు గురించే ఆలోచిస్తుంది. అవ్వాతాతలకు, అర్హులైన వారికి పింఛన్లు నేరుగా ఇంటికే వెళ్లి అందించినప్పుడు వారి ముఖాల్లో చూసిన ఆనందం నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను" అని అన్నారు. ప్రభుత్వ సాయం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా, ఎంతో గౌరవంగా అందుతుందా లేదా అని తాను ఎప్పటికప్పుడు స్వయంగా పరిశీలిస్తుంటానని సీఎం వివరించారు.

**'తల్లికి వందనం' నిధుల పెంపుపై హామీ**

పిల్లల చదువుల కోసం ప్రభుత్వం అందిస్తున్న 'తల్లికి వందనం' పథకం కింద ప్రస్తుతం రూ.15,000 ఇస్తున్నామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో భగవంతుడి దయ ఉండి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడితే ఈ సహాయాన్ని ఇంకా పెంచుతామని ప్రజలకు మాట ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలను ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. "గతంలో ఒక గొడ్డలి పార్టీ ప్రజల ఆస్తులను, భూములను మార్చేసి తీవ్ర గందరగోళం సృష్టించింది. కానీ మా కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల భూముల జోలికి ఎవరూ రాకుండా గట్టి చర్యలు తీసుకున్నాం. రాష్ట్రంలో ఎక్కడా భూతగాదాలు లేకుండా చేసే పూర్తి బాధ్యత మా ప్రభుత్వానిదే" అని ఆయన భరోసా ఇచ్చారు.

**పిల్లలే మన సంపద.. జనాభా నియంత్రణ వద్దు**

జనాభా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక ఆసక్తికరమైన మార్పును ప్రతిపాదించారు. ఒకప్పుడు దేశంలో జనాభాను తగ్గించడానికి కుటుంబ నియంత్రణ పాటించాలని తానే స్వయంగా ప్రచారం చేశానని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలే మన అసలైన సంపద అని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో యువత కొరత రాకుండా ఉండాలంటే జనాభా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా కుటుంబాల్లో మూడో బిడ్డ జన్మిస్తే పుట్టిన వెంటనే రూ.30,000, అలాగే నాలుగో బిడ్డ పుడితే వెంటనే రూ.40,000 ప్రభుత్వ తరపున ఆర్థిక సాయం అందిస్తామని సంచలన ప్రకటన చేశారు. పిల్లలను భారం అనుకోకుండా, దేశానికి వారే సంపద అని తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. ప్రభుత్వానికి మంచి పేరు రావడానికి రాత్రింబవళ్లు కష్టపడుతున్న అధికారులే కారణమని, అలాగే తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ తనకు అండగా ఉంటారని కొనియాడారు. పేదరికం లేని సమాజాన్ని చూడటమే తన అంతిమ కోరికని సీఎం చెప్పారు.

**రూ..23 లక్షల కోట్ల పెట్టుబడులు.. 24 లక్షల ఉద్యోగాలు**

రాష్ట్ర ఆర్థిక ప్రగతి గురించి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, గత 23 నెలల కాలంలోనే ఆంధ్రప్రదేశ్‌కు ఏకంగా రూ.23 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. ఈ పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాల ద్వారా మన రాష్ట్ర యువతకు దాదాపు 24 లక్షల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక రంగంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'గూగుల్' సంస్థను విశాఖపట్నానికి తీసుకువచ్చామని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో భారీగా పరిశ్రమలను స్థాపించడం ద్వారా ఇక్కడి నుంచి ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే వలసలను పూర్తిగా అరికడతామన్నారు. భవిష్యత్తులో ఇతర ప్రాంతాల నుంచే ఉత్తరాంధ్రకు వలసలు వచ్చేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎంతో పొటెన్షియల్ ఉన్నప్పటికీ శ్రీకాకుళం జిల్లా ఇంకా వెనుకబడే ఉందని, ఈ జిల్లాతో పాటు మొత్తం ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేందుకు అనేక కొత్త ప్రాజెక్టులను తీసుకువచ్చేందుకు తమ ప్రభుత్వం శ్రమిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# డిజిటల్ చెల్లింపుల్లో అగ్రగామి భారత్

**(మొదటి పేజీ తరువాయి)**

అనిపిస్తోందని ప్రధాని మోదీ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. నెదర్లాండ్స్ దేశ అగ్ర నాయకత్వంతో తాను ఎప్పుడు మాట్లాడినా.. వారు ఇక్కడి భారతీయుల కష్టపడే తత్వాన్ని, వారి ప్రతిభను ఎంతో గొప్పగా ప్రశంసిస్తారని గుర్తుచేశారు. డచ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మనవాళ్లు అందిస్తున్న సేవలను చూసి ప్రతి భారతీయుడు గర్వపడాలన్నారు.

**భారతీయ సంస్కృతి, విలువలు మారవు**

ది హేగ్ నగరం భారత్‌నెదర్లాండ్స్ దేశాల స్నేహానికి ఒక సజీవ చిహ్నంగా మారిందని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఎన్నో ఏళ్ల క్రితం ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకుని ఇక్కడ స్థిరపడిన భారతీయ కుటుంబాల కథలు కేవలం వలసల కథలు మాత్రమే కావని, అవి వారి ఆత్మవిశ్వాసానికి, సాధించిన అభివృద్ధికి నిదర్శనాలని చెప్పారు. కాలం గడిచి తరాలు మారినా, దేశాలు మారినా కూడా భారతీయ కుటుంబాల విలువలు, మన సంస్కృతి సంప్రదాయాలు అస్సలు మారలేదని ఆయన కొనియాడారు. ఇక్కడి జీవనశైలికి అలవాటు పడి, డచ్ భాషను పూర్తిగా నేర్చుకున్నప్పటికీ.. తమ మూల భాషలను, భారతీయ పండుగలను ప్రవాస భారతీయులు మర్చిపోకుండా గుండెల్లో దాచుకున్నారని అభినందించారు.

**ప్రపంచానికిది విపత్తుల దశాబ్దం**

ప్రస్తుత కాలంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తీవ్రమైన సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట కరోనా మహమ్మారి వచ్చి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిందని, ఆ తర్వాత దేశాల మధ్య యుద్ధాలు ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ఇంధన (ఆయిల్, గ్యాస్) సంక్షోమం ప్రపంచాన్ని వేధిస్తోందని ఆయన వివరించారు. ఈ పరిణామాలను చూస్తుంటే ప్రస్తుత దశాబ్దం ప్రపంచానికి ఒక విపత్తుల (డిజాస్టర్ల) దశకంగా మారుతోందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా పరిస్థితులు గనుక త్వరగా మారకపోతే, ప్రపంచ దేశాలు గత కొన్ని దశాబ్దాలుగా సాధించిన అభివృద్ధి ఫలితాలన్నీ ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందనన్నారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా భారీ సంఖ్యలో ప్రజలు మళ్లీ పేదరికంలోకి జారిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.

**బలమైన సరఫరా వ్యవస్థ కోసం భాగస్వామ్యం**

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రపంచ దేశాలన్నీ నమ్మకమైన సరఫరా వ్యవస్థ (రెసిలియెంట్ సప్లై చైన్) వైపు చూస్తున్నాయని ప్రధాని తెలిపారు. ఈ క్రమంలోనే భారత్, నెదర్లాండ్స్ దేశాలు కలిసి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎంతో నమ్మకమైన, పారదర్శకమైన సరఫరా వ్యవస్థను రూపొందించేందుకు చేతులు కలిపాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం తీసుకురావడానికి రెండు దేశాలు తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్నాయని వెల్లడించారు. 21వ శతాబ్దంలో భారతదేశం ప్రపంచానికి ఒక అపారమైన అవకాశాల భూమిగా ఎదుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. భారత్ ఒకవైపు సరికొత్త టెక్నాలజీతో దూసుకుపోతూనే, మరోవైపు మానవీయ విలువలను కాపాడుకుంటూ సమతుల్యంగా ముందుకు సాగుతోందన్నారు. మన దేశం ఎంత పురాతనమైనదో, అంతే ఆధునికంగా కూడా మారుతోందని వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో పాతికేళ్ల తర్వాత 'సర్' విప్లవం

హైదరాబాద్ వెలుతురు మే 16:

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ఎన్నికల సంఘం సిద్ధమైంది. బోగస్ ఓట్లను ఏరివేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియను చేపట్టనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ మెగా సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలను, షెడ్యూల్‌ను వెల్లడించారు. రాష్ట్రంలో దాదాపు పాతికేళ్ల (25 ఏళ్లు) సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ఈ సరికొత్త 'సర్' ప్రక్రియ జరగబోతోందని ఆయన వివరించారు. వచ్చే నెల (జూన్) 15 నుంచి ఈ ప్రక్రియకు సంబంధించిన ప్రాథమిక పనులు ప్రారంభం కానున్నాయి.

**నెలకు పైగా ఇంటింటి వెరిఫికేషన్**

రాష్ట్రంలో క్షేత్రస్థాయి పరిశీలన కోసం జూన్ 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు నెల రోజుల పాటు ముమ్మరంగా ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ (DoortoDoor Verification) నిర్వహిస్తామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓలు) నేరుగా ప్రతి ఇంటినీ సందర్శించి, అక్కడ నివసిస్తున్న ఓటర్ల వివరాలను సేకరిస్తారని చెప్పారు. ఈ క్రమంలో ప్రతి ఓటరుకూ రెండేసి చొప్పున 'ఎన్యుమరేషన్ ఫామ్‌లు' (గణన పత్రాలు) అందజేస్తారు. ఓటరు అందులో ఒక ఫామ్‌ను పూర్తిగా భర్తీ చేసి తిరిగి బీఎల్‌ఓకు అప్పగించాల్సి ఉంటుంది. రెండో ఫామ్‌ను ఓటరు భవిష్యత్తు అవసరాల కోసం అక్నాలెడ్జ్‌మెంట్ (రసీదు) కార్డుగా తన వద్దే భద్రపరుచుకోవచ్చని సీఈఓ స్పష్టం చేశారు.

**వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ ఎన్యుమరేషన్**

ఇంటికి వచ్చే అధికారులకు ఫారాలు ఇవ్వడమే కాకుండా, సాంకేతికతను ఉపయోగించుకుని ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు ఎన్నికల ప్రధాన అధికారి వెల్లడించారు. ఓటర్లు కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన అధికారిక వెబ్‌సైట్ *voters.eci.gov.in* లోకి లాగిన్ అయి తమ వివరాలను సులభంగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఇలా సేకరించిన పూర్తి డేటాను, దరఖాస్తులను క్రోడీకరించి, వాటి ఆధారంగా అధికారులు ఓటర్ల ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ నోటిఫికేషన్)ను సిద్ధం చేస్తారు.

**అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా**

ఈ 'సర్' ప్రక్రియ ద్వారా రూపొందించిన ఓటరు ముసాయిదా జాబితాను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడంతో పాటు, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోనూ ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచుతామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు రాజకీయ పార్టీలు లేదా సాధారణ ప్రజలు ఎవరైనా తమ అభ్యంతరాలను, సవరణలను దాఖలు చేయవచ్చని తెలిపారు. వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దిన తర్వాత.. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ రాష్ట్ర అధికారిక తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని డేట్‌లైన్ ప్రకటించారు.

## ఆర్‌జీ కర్ ఘటనపై బంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం

పశ్చిమ బంగాల్ వెలుతురు మే 16:

దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ హత్యాచార ఘటనపై పశ్చిమ బంగాల్‌లోని నూతన కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కేసు దర్యాప్తులో తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు నిర్ధారణ కావడంతో ముగ్గురు ఉన్నత స్థాయి ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. బాధితురాలికి న్యాయం చేయడంలో ఎటువంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఈ చర్య ద్వారా స్పష్టం చేశారు.

**విచారణలో లోపాలు.. లంచం ఆరోపణలు**

కోల్‌కతాలోని రాష్ట్ర సచివాలయం (నబన్నా)లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి సువేందు అధికారి స్వయంగా ఈ వివరాలను వెల్లడించారు. ఆర్‌జీ కర్ ఘటన జరిగిన సమయంలో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంలో తీవ్రమైన పరిపాలనా లోపాలు జరిగాయని, దర్యాప్తును పక్కదారి పట్టించేలా వ్యవహరించారని ఆయన మండిపడ్డారు. దీనితో పాటు బాధితురాలి కుటుంబ సభ్యులను ప్రలోభపెట్టేందుకు, కేసును అణచివేయడానికి లంచాలు ఇవ్వజూపినట్లు అధికారులపై తీవ్ర ఆరోపణలు వచ్చాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే సీనియర్ ఐపీఎస్ అధికారులు వినీత్ గోయల్, ఇందిరా ముఖర్జీ, అభిషేక్ గుప్తాలను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ ముగ్గురిపై శాఖాపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

**రక్షకులే భక్షకులుగా మారారు: సీఎం**

గత తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని సువేందు అధికారి విమర్శించారు. "గత ప్రభుత్వ పాలనలో ప్రజలను కాపాడాల్సిన రక్షకులే భక్షకులుగా మారారు. పోలీస్, పరిపాలనా విభాగాల్లోని కొందరు అధికారులు నేరస్థులతో చేతులు కలిపి సమాంతర వ్యవస్థను నడిపారు. ఈ దుర్మార్గపు నెట్‌వర్క్‌ను పూర్తిగా అంతమొందించడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని సీఎం స్పష్టం చేశారు. 'అభయ'పై జరిగిన దారుణం యావత్ దేశాన్ని, రాష్ట్రాన్ని కుదిపేసిందని, ఇలాంటి సంఘటనల విషయంలో తమ ప్రభుత్వం ఏమాత్రం సహించదని చెప్పారు. పారదర్శకమైన, నిష్పక్షపాతమైన విచారణ కోసమే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.

**జైళ్లలో అక్రమాలపై సీఎం సీరియస్**

రాష్ట్రంలో కేవలం పోలీస్ వ్యవస్థలోనే కాకుండా, జైళ్ల శాఖలో జరుగుతున్న అక్రమాలపై కూడా సీఎం సువేందు అధికారి గట్టిగా దృష్టి పెట్టారు. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కరెక్షనల్ హోమ్ (జైలు)లో ఉన్న ఖైదీలు పెద్ద ఎత్తున మొబైల్ ఫోన్లు వాడుతున్నట్లు తమకు బాధితుల బంధువుల నుంచి ఫిర్యాదులు అందాయని ఆయన పేర్కొన్నారు. జైలు నిబంధనలను ఉల్లంఘించి ఖైదీలకు సదుపాయాలు కల్పించడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలనా నిర్లక్ష్యానికి బాధ్యులుగా చేస్తూ ప్రెసిడెన్సీ జైలు సూపరింటెండెంట్ ఎన్. కుజూర్, చీఫ్ కంట్రోలర్ దీప్తా ఘోరాయ్‌లను వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

## బీజేపీ వీరనారీ మనులు ఎక్కడ?

**హైదరాబాద్ వెలుతురు మే 16:**

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ మాట్లాడుతూ, సాక్షాత్తు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ దాదాపు పది రోజులుగా అదృశ్యమై పరారీలో ఉన్నాడన్న ఆరోపణల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ మహిళా నాయకత్వం ఎందుకు మౌనం పాటిస్తోందని ప్రశ్నించారు.

"బేటీ బచావో - బేటీ పడావో", "దేశం కోసం - ధర్మం కోసం" అంటూ ప్రతి రోజు మాట్లాడే బీజేపీ మహిళా నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని ఆయన నిలదీశారు. మహిళల గౌరవం, మైనర్ బాలికల రక్షణ, హిందూ ధర్మం గురించి గొప్పలు చెప్పుకునే నాయకత్వం ఇలాంటి సమయంలో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.

హిందూ ధర్మాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, శ్రీరాముడు తల్లిదండ్రుల ఆజ్ఞను గౌరవించి ధర్మం కోసం అరణ్యవాసం చేసిన విషయాన్ని గుర్తుచేసిన ఆయన, సీతాదేవి వారసులమని చెప్పుకునే మహిళా నాయకులు ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండటం ఏమి సూచిస్తోందని ప్రశ్నించారు.ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా "హనీట్రాప్" అంశాలపై చర్చ జరుగుతోందని, ఒకవేళ నిజంగానే అలాంటి కోణం ఉంటే అది అత్యంత తీవ్రమైన విషయం అవుతుందని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో సంబంధిత వ్యక్తులు చట్టపరమైన విచారణకు సహకరించాలని, ప్రజల్లో ఉన్న అనుమానాలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# సర్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి
## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



- **ఓటరు జాబితా సవరణను ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని ఆదేశం**
- **రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం కార్యాచరణ ప్రణాళిక అమలు**
- **జూన్ 15 నుంచి 24 వరకు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం**
- **జూన్ 25 నుంచి ఇంటింటి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ**
- **జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేయాలని సూచన**
- **జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల**
- **ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ కొనసాగింపు**
- **అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడి**
- **ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లకు మించకూడదని ఆదేశం**
- **బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచన**

హైదరాబాద్ వెలుతురు మే 16:

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలుకు కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసిందని తెలిపారు.

జూన్ 15 నుంచి 24 వరకు సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, ఎన్యూమరేషన్ ఫారాల ముద్రణ తదితర ఏర్పాట్లు చేపట్టనున్నట్లు చెప్పారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి తిరిగి స్వీకరిస్తారని తెలిపారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు.

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభానికి ముందే ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు.

పెండింగ్‌లో ఉన్న ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 మందికి మించకుండా ఓటర్ల సంఖ్య ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న ఓటర్ల నమోదుపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు.

మీడియా, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలపై వెంటనే స్పందించి నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ సంగీత మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పార్లమెంట్‌పై కాంగ్రెస్ ఫోకస్





- **పార్టీ బలోపేతం, SIR ఓటరు జాబితా సవరణపై కీలక ఆదేశాలు**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నేతల కీలక సమావేశం**
- **పార్టీ సంస్థాగత అభివృద్ధిపై విస్తృత స్థాయిలో చర్చ**
- **ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం**
- **మండలాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించాలని సూచనలు**
- **SIR ఓటరు జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలని నేతలకు ఆదేశాలు**
- **వరి ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చర్యలకు పిలుపు**
- **పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని నేతల అభిప్రాయం**
- **నామినేటెడ్ పదవుల్లో మూడు సంవత్సరాల అంశం పరిగణనలోకి తీసుకోవాలని సూచన**
- **ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌తో జూమ్ సమావేశం నిర్వహణ**
- **ప్రతి గ్రామంలో బీఎల్ఏల నియామకం పూర్తి చేయాలని పీసీసీ ఆదేశం**

హైదరాబాద్ వెలుతురు మే 16:

మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఇంచార్జులు, అబ్జర్వర్లతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, కేకే మహేందర్ రెడ్డి, ఒడితల ప్రణవ్‌తో పాటు పలువురు నియోజకవర్గ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. అలాగే ప్రతి మండలంలో పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌ను మరింత చైతన్యవంతం చేయాలని నిర్ణయించారు.

SIR (ఓటరు జాబితా సవరణ) ప్రక్రియపై నియోజకవర్గ ఇంచార్జులు, కోఆర్డినేటర్లు అప్రమత్తంగా ఉండాలని సమావేశంలో స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో బీఎల్ఏల నియామకం పూర్తి చేసి, వారి వివరాలను డీసీసీల ద్వారా కలెక్టర్లకు పంపించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి లోపాలు లేకుండా పార్టీ నేతలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

నియోజకవర్గాల వారీగా వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నేతలు క్రియాశీలకంగా వ్యవహరించాలని సమావేశంలో నిర్ణయించారు. రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ముందుండాలని నేతలు పేర్కొన్నారు.

పార్టీ కోసం మొదటి నుంచీ క్రియాశీలంగా పనిచేస్తున్న వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. నామినేటెడ్ పార్టీ పదవుల విషయంలో పార్టీ నిర్ణయించిన విధంగా మూడు సంవత్సరాల వ్యవధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

అనంతరం ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్‌తో కరీంనగర్ పార్లమెంట్ ముఖ్య నేతలు జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా SIR ఓటరు జాబితా సవరణపై నేతలకు దిశానిర్దేశం చేశారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో SIR ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి గ్రామంలో బీఎల్ఏల నియామకం పూర్తి చేయాలని పీసీసీ ఆదేశించింది. అలాగే ప్రతి నియోజకవర్గంలో కొత్త మండల అధ్యక్షులను నియమించి మండల కమిటీలను పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

# నూతన గృహప్రవేశంలో పాల్గొన్న చిలువేరు సమ్మయ్య గౌడ్

కేసముద్రం వెలుతురు మే 16:



కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో పలుస స్వప్న సంపత్, వార్డు సభ్యులు పల్స పద్మ వెంకన్నలు నూతన ఇంటి గృహప్రవేశానికి గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ను ఆహ్వానించగా వారి ఆప్యాయత అనురాగాల ఆహ్వానం మేరకు వారి నూతన గృహప్రవేశానికి హాజరై వారి కుటుంబాలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సంపన్నులై సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారి కుటుంబాలకు నూతన వస్త్రాలు బహుకరించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకన్న, వార్డు సభ్యులు సంపత్ కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ పబ్బతి సారంగం, విద్యా కమిటీ చైర్మన్ తండ శ్రీనివాస్, బట్టు వీరస్వామి, చింతకాయల వీరభద్రం, బండారు వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు..

# బీసీ, మహిళా నాయకత్వానికి కాంగ్రెస్ పెద్దపీట

- **సమగ్ర తెలంగాణ నిర్మాణంలో మరో ముందడుగు**
- **కె. సారిత తిరుపతయ్య గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు.**
- **డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

హైదరాబాద్ వెలుతురు మే 16:



శనివారం రోజున తెలంగాణ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్‌గా ఇటీవల నియమితులైన శ్రీమతి కె. సారిత తిరుపతయ్య గారిని మర్యాదపూర్వకంగా కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

ఆమె రాజకీయ ప్రయాణం, పార్టీ పట్ల అంకితభావం, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి నిజంగా అభినందనీయం. మహిళల సాధికారత, గ్రామీణాభివృద్ధి, గొర్రెల పెంపకదారుల సంక్షేమం కోసం ఆమె నిరంతరం పనిచేస్తూ ప్రజలతో మమేకమైన నాయకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.

బీసీ వర్గాలకు, మహిళా నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి సమర్థ మహిళా నాయకురాలికి అవకాశం కల్పించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడ "మహేశ్ కుమార్ గౌడ్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. వారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం, బీసీ సాధికారత, మహిళా ప్రాతినిధ్యానికి మరింత బలాన్ని అందిస్తోంది.

శ్రీమతి కె. సారిత తిరుపతయ్య గారి నాయకత్వంలో తెలంగాణ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ మరింత సమర్థవంతంగా పనిచేసి బీసీ కుటుంబాలు, గొర్రెల పెంపకదారులు మరియు మహిళల అభివృద్ధికి విశేషంగా దోహదపడుతుందని నమ్ముతున్నాను.

శ్రీమతి కె. సారిత తిరుపతయ్య గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు.




# తిరుమల క్యూలైన్లలో భక్తుల అల్లాటప్పా

## : ఎండ తీవ్రతకు తోడైన అధికారుల నిర్లక్ష్యం!



**తిరుమల**

కలియుగ వైకుంఠం తిరుమలలో శ్రీవారిని దర్శించుకోవడానికి వచ్చే సామాన్య భక్తులకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు భానుడి భగ భగలు, మరోవైపు క్యూలైన్లలో ఉక్కపోతతో భక్తులు విలవిలలాడుతున్నారు. వేసవి కాలం రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ఏర్పాట్లు చేయడంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పనిచేయని ఫ్యాన్లు.. ఉక్కిరిబిక్కిరి అవుతున్న భక్తులు**

శ్రీవారి దర్శనం కోసం గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండే భక్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు చాలా చోట్ల మూలపడ్డాయి. పనిచేయని ఈ ఫ్యాన్ల వల్ల లోపల గాలి ఆడక, విపరీతమైన ఉక్కపోతతో భక్తులు ఊపిరాడక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ఉక్కపోతను తట్టుకోలేక చిన్నపిల్లలు ఏడుస్తున్న దృశ్యాలు క్యూలైన్లలో గుండెలు పిండేస్తున్నాయి.

**ఆదాయంపై ఉన్న శ్రద్ధ.. సౌకర్యాలపై లేదా?**

కానుకలు, లడ్డూ ప్రసాదాల విక్రయాలు, దర్శన టికెట్ల ద్వారా టీటీడీకి రోజుకు కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోంది. ఇంత భారీ స్థాయిలో ఆదాయం వస్తున్నప్పటికీ, క్యూలైన్లలో పాడైపోయిన ఫ్యాన్లను రిపేర్ చేయించాలనే కనీస ఆలోచన అధికారులకు లేకపోవడం గమనార్హం. భక్తులు సమర్పించే కానుకలతో కోట్లు గడిస్తున్న బోర్డు, వారికి కనీస గాలి, వెలుతురు సౌకర్యం కూడా కల్పించలేకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**"అధికారులు ఏసీ రూములు.. సామాన్యులకు ఉక్కపోత కష్టాలు"**

సామాన్య భక్తులు క్యూలైన్లలో చెమటలు కక్కుతూ ఇబ్బందులు పడుతుంటే, టీటీడీ ఉన్నతాధికారులు మాత్రం ఏసీ గదులు, ఏసీ కార్లు, విలాసవంతమైన వసతి గృహాలకే పరిమితమయ్యారనే విమర్శలు భక్తుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. విఐపిల సౌకర్యాలపై చూపే శ్రద్ధలో పదో వంతు కూడా సామాన్య భక్తులపై చూపించడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది.

**తక్షణమే చర్యలు చేపట్టాలి**

వేసవి కాలం ఇంకా ముగియనందున భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులు ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి, క్యూలైన్లలోని క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలి. యుద్ధప్రాతిపదికన పాడైన ఫ్యాన్లను రిపేర్ చేయించడంతో పాటు, భక్తులకు చల్లని తాగునీరు, నిరంతర గాలి వీచేలా అదనపు కూలర్లు ఏర్పాటు చేయాలని సామాన్య భక్తులు డిమాండ్ చేస్తున్నారు

# విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం 'సురక్ష కవచ్' హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ

- **యువత భవిష్యత్తు కోసం చర్చ, మానసిక ఆరోగ్యం కీలకం : సైబరాబాద్ సీపీ డా. యం. రమేష్**

శేరిలింగంపల్లి వెలుతురు మే 16:

సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (SCSC) విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం మాదకద్రవ్యాల నియంత్రణ పై అవగాహన, బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో "సురక్ష కవచ్ - కాలేజ్ సేఫ్టీ & వెల్‌బీయింగ్ హ్యాండ్‌బుక్" ను ప్రారంభించారు. విద్యార్థుల నేతృత్వంలోని క్లబ్‌ల ద్వారా వారిని సాధికారులను చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం.

ఈ ప్రారంభోత్సవ వేడుకలో పోలీస్ ఉన్నతాధికారులు, విద్యా రంగ నిపుణులు, మానసిక ఆరోగ్య నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొని, విద్యా సంస్థల్లో సురక్షితమైన వాతావరణం కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్ మాట్లాడుతూ.. యువతలో పెరుగుతున్న ఒత్తిడి, ఒంటరితనం, వ్యసనాలను ఎదుర్కోవడానికి బహిరంగ చర్చలు జరగాలని, భావోద్వేగ నియంత్రణ, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఎంతో ముఖ్యమని నొక్కి చెప్పారు. డ్రగ్ నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటిస్తూనే, విద్యార్థులు ఏవైనా సమస్యలు ఉంటే తమ కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా మెంటర్లతో స్వేచ్ఛగా పంచుకోవాలని సూచించారు. చర్చా సమయంలో బయోకెమిస్ట్రీ ఫ్యాకల్టీ వరలక్ష్మి మాట్లాడుతూ, కేవలం అవగాహన కార్యక్రమాలు మాత్రమే కాకుండా చర్చా వేదికలు (Discussion Forums) కూడా ముఖ్యమని సూచించారు. నల్సార్ యూనివర్సిటీ విద్యార్థి శ్రీవర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. డ్రగ్స్ వ్యక్తులను, కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తాయని, వీటి నివారణలో పోలీసులకు సమాజం మరియు విద్యార్థుల మద్దతు అత్యవసరమని సీపీ స్పష్టం చేశారు.




నటుడు, దర్శకుడు, రచయిత రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ.. పెరుగుతున్న వ్యసనాలు, తోటివారి ఒత్తిడి మరియు అనారోగ్యకరమైన అలవాట్ల వల్ల కలిగే ప్రమాదాల గురించి విద్యార్థులను హెచ్చరించారు. విద్యార్థులు తమ జీవితంలో సానుకూల లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, 'సురక్ష కవచ్' వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సురక్షితమైన క్యాంపస్‌లను రూపొందించాలని కోరారు.

అనంతరం, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ *ప్రొఫెసర్ బాలక్రిష్టా రెడ్డి* మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమంలో విద్యా సంస్థల పాత్రను గుర్తుచేశారు. క్యాంపస్‌లలో యాంటీ రాగింగ్ చర్యలు, భద్రతా యంత్రాంగాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు.

ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు శ్రీమతి వనితా దాట్ల, శ్రీమతి చేతనా కాసం, మరియు శ్రీమతి శ్రీవిద్య రెడ్డి మాట్లాడుతూ.. సమాజం మరియు పోలీసుల సహకారంతో యువత రక్షణ కోసం ఎస్‌సీఎస్‌సీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీమతి వైశాలి సాగర్ నేతృత్వంలో విద్యార్థులు "ముందుకు రండి, గళమెత్తండి. మౌనంగా ఉండకండి" అని సూచించారు.

మహిళా మరియు శిశు భద్రతా విభాగం డీసీపీ కె. సృజన మాట్లాడుతూ.. విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీ మార్గదర్శకాలు, 'పోష్' మరియు 'పోక్సో' నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. భద్రతా క్లబ్‌లను బలోపేతం చేయాలని సూచించారు.

ఎస్‌సీఎస్‌సీ డైరెక్టర్ శ్రీమతి రష్మి శ్రీవాస్తవ విద్యార్థులు మరియు అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించి, క్యాంపస్‌లలో సేఫ్టీ మరియు వెల్‌నెస్ క్లబ్‌ల ఏర్పాటుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమ ముగింపులో 'పాఠశాల' అనే యువ బృందం తెలుగు పాటలతో అందరినీ ఉత్సాహపరిచింది.

ఈ కార్యక్రమంలో డా. ఎం. రమేష్ (సీపీ, సైబరాబాద్), కె. సృజన (డీసీపీ), రాహుల్ రవీంద్రన్ (నటుడుదర్శకుడు), బాలక్రిష్టా రెడ్డి (ఛైర్మన్, ఉన్నత విద్యా మండలి), వనితా దాట్ల (ఎలికో హెల్త్‌కేర్), చేతనా కాసం (లీగల్ కార్నర్ ఎల్‌ఎల్‌పి), శ్రీవిద్య రెడ్డి (జి. పుల్లారెడ్డి విద్యా సంస్థలు), వైశాలి సాగర్ (మైక్రాన్ టెక్నాలజీ) మరియు రష్మి శ్రీవాస్తవ (డైరెక్టర్, SCSC) తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన మంచాల మండలం హౌసింగ్ ఏఈ మానస, ఇందిరమ్మ కమిటీ సభ్యులు

- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తాం ఇందిరమ్మ కమిటీ సభ్యులు**

మంచాల వెలుతురు మే16:



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను ఆరుట్లగ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన మంచాల మండలం హౌసింగ్ ఏఈ మానస ముందుగా నిర్మాణం పూర్తి అయిన కొందూరు భాగ్యమ్మ ఇల్లును పరిశీలిం చారు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి ఇల్లు నిర్మాణమై సొంత ఇంటి కల నెరవేరినందుకు అయి నందుకు లబ్ధిదారురాలు భాగ్యమ్మ ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మాకు ఇల్లు మంజూరు కావడానికి సహకరించిన ఇబ్రహీంపట్నంఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈసందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆ రుట్ల గ్రామంలో ఇప్పటికి మంజూరైన 53 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యాయి త్వరలో ఇబ్రహీంప ట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారిని ఆరుట్ల గ్రామానికి ఆహ్వానించి పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యేగారితో ప్రారంభిస్తాం అని అన్నారు ఆరుట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూ రు కాలేదని ఎవ్వరు ఆందోళన చెందవద్దు అన్నారు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారం తో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం అని అన్నారు ఇందిరమ్మరాజ్యం ఇంటింటా సౌభాగ్యం ఉండాలే ప్రజల కండల్లో సంతోషం చూడాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజాపాలన చేస్తుంది అనిఅన్నారు కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కం బాలపల్లి బుగ్గరాములు చెరుకు నరసింహ గౌడ్ బుట్టి కృష్ణ ముదిరాజ్ మార లక్ష్మణ్ కోరే బాబు ల బ్ధిదారులు కొండురు భాగ్యమ్మ రాజు తదితరులు పాల్గొన్నారు

# పెంచిన పెట్రోల్, డీజిల్, ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి

- **పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి కార్మికులను పేదలను, సూక్ష్మ మధ్యతరగతి పరిశ్రమలను ఇబ్బందులకు గురి చేస్తున్న మోడీ ప్రభుత్వం**
- **సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్**

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 16:



కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, సిజిఎస్ గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ దగ్గర నిరసన తెలియజేయడం జరిగింది త్వరలో పెరుగుదల వల్ల పేద మధ్యతరగతి ప్రజలపై మరియు చిన్న పరిశ్రమలపై భారాలు మోపడం దుర్మార్గమని సిపిఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. డీజిల్ ,పెట్రోల్ , గ్యాస్ ,ధరలు పెంచడంతో. నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో పాటు చిన్న మధ్య తరగతి పరిశ్రమలు దెబ్బతిని వాటిలో పనిచేసే కార్మికుల ఉపాధి అవకాశాలు పోతాయని అన్నారు కార్మిక వర్గంపై ధరల ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు ఇప్పటికే కార్మికులకు కనీస వేతనాలు లేక పని గంటలు అమలు చేయక ఇబ్బందులు పడుతుంటే మరోపక్క పెట్రోల్ డీజిల్ ధరల భారం మోపడం సరికాదన్నారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే మోడీ ప్రభుత్వం ప్రజలపై పెట్రోల్, డీజిల్ భారం మోపిందని విమర్శించారు. గత కొన్ని రోజులుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని ప్రజలు మొత్తుకుంటుంటే పెంచమని గొప్పలు చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ప్రజలపై భారాలు మోపడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడైనా ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చిన తర్వాత పెట్రోలు డీజిల్ ధరలు పెంచడం ఆనవాయితీగా వస్తుందన్నారు.తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను ఉపసంహరించుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు,ఈ దేవదానం,కె శీను,నర్సింలు వీరేష్, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




శంకర్ పల్లి వెలుతురు మే 16 :

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ఫతేపూర్ ఫ్లైఓవర్ సమీపంలో భరత్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని శనివారం ఉదయం నుంచే అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. ప్రయాణికులు, పేద ప్రజలు, కార్మికులు మరియు అవసరమైన వారికి ఉచితంగా భోజనం అందజేస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి శనివారం, ఆదివారం రోజుల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో సాధారణ వైద్య పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు, ఆరోగ్య సూచనలు మరియు అవసరమైన వారికి వైద్య సలహాలు అందించనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. సామాజిక సేవలో భాగంగా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం వెల్లడించింది. స్థానిక ప్రజలు ఈ ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ భరత్ మరియు మణిలు కోరారు.

# ఆరుట్ల గ్రామంలో గృహ నిర్మాణాల కార్మికుల కార్యవర్గ కమిటీ ఎన్నిక



- **మేస్త్రి అసోసియేషన్ అధ్యక్షుడిగా తవిటి నరసింహ ముదిరాజ్ గౌరవ అధ్యక్షుడిగా మొర్రి ఐలయ్య**

మంచాల వెలుతురు మే16:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో గృహ నిర్మాణాల కార్మికుల సమావేశం కంఠమహేశ్వర దే వాలయంలో జరిగింది ఈసమావేశానికి గృహనిర్మాణం చేసే మేస్త్రీలు సెంట్రింగ్ కార్మికులు పెయిం టర్ కార్మికులు ఎలక్ట్రిక్ ప్లంబర్ కార్మికులు హాజరు అయినారు ఈసమావేశంలో ఆరుట్ల గ్రామ మేస్త్రి అసోసియేషన్ కార్యవర్గ కమిటీ ఎన్నిక జరిగింది మేస్త్రి అసోసియేషన్ అధ్యక్షుడిగా తవిటి నర సింహ ముదిరాజ్ గౌరవ అధ్యక్షుడిగా మొర్రి ఐలయ్యను ఎన్నుకున్నారు సందర్భంగా నూతనంగా ఎన్నికైన నరసింహ ముదిరాజ్ ఐలయ్య మాట్లాడుతూ ఆరుట్ల గ్రామంలో గృహనిర్మాణ కార్మికులం అందరం ఐక్యంగా ఉండి ఏఒక్క కార్మికునికి ఎలాంటి ఆపద వచ్చిన అండగా ఉండాలి అని అన్నా రుఆరుట్ల గ్రామ మేస్త్రి అసోసియేషన్ నూతన కమిటీ కార్యవర్గం అధ్యక్షుడిగా తవిటి నరసింహ ముదిరాజ్ గౌరవ అధ్యక్షుడిగా మొర్రి ఐలయ్య ఉపాధ్యక్షులుగా కొండూరు శేఖర్ కోరే బాబు కోశాధికారిగా బుట్టి కృష్ణ ముదిరాజ్ సహాయ కార్యదర్శిగా అనుపాటి యాదయ్య ప్రచార కార్యదర్శు లుగా ఆడెపు మారేష్ పంబాల శివకుమార్ మంద మైపాల్ రెడ్డి శ్రీకాంత్ సలహాదారులుగా జోగు పాపయ్య గొరిగే పాండు పంది వెంకటయ్య కొండి గారి శంకరయ్య ఆడెపు రమేష్ ఎన్నిక అయ్యా రు ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన మేస్త్రి అసోసియేషన్ కార్యవర్గకమిటీ సభ్యులను ఘనంగా సన్మానించిన గృహనిర్మాణ కార్మికులు ఈ కార్యక్రమంలో మేస్త్రీలు కార్మికులు పెద్దఎత్తునపాల్గొన్నారు

# మైనంపల్లి హనుమంతరావు చొరవతో మంజూరైన ఎల్ ఓ సి... కుటుంబానికి కాంగ్రెస్ నేతల భరోసా

మౌలాలి, మే 16 వెలుతురు:



మౌలాలి డివిజన్ సాయినాథపురానికి చెందిన చి. లలిత అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి, పంజాగుట్టలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో వైద్య ఖర్చులను భరించడం కష్టసాధ్యంగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.

ఈ విషయాన్ని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు దృష్టికి మౌలాలి డివిజన్ నాయకులు తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,00,000 విలువైన ఎల్.ఓ.సి మంజూరు చేయించారు. అనంతరం ఆ ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా చి. లలిత కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురై మైనంపల్లి హనుమంతరావుతో పాటు సహకరించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎప్పుడూ ముందుంటారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి లక్ష్మీకాంతరెడ్డి, బీబ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీకే శీను, మహిళా బీబ్లాక్ అధ్యక్షురాలు ఆశ, మౌలాలి డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, సంపత్ గౌడ్, ప్రవీణ్, యూసఫ్, సీనియర్ నాయకుడు చంద్రకాంత్, పార్థు, శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్, లక్ష్మణ్, నవీన్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ అవసరమైన సహాయాన్ని అందించడంలో కాంగ్రెస్ నాయకులు ముందుండటం అభినందనీయమని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఓటు విలువను ప్రతి పౌరుడికి తెలియజేస్తూ S.I.R (సర్) కార్యక్రమంలో అందరి ఓట్లు ఉండేలా నాయకులు, బిఎల్ఏలు పనిచేయాలి :బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్.

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మే 16:

బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం సిఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో Special intensive Revision (SIR) పై నిర్వహించిన అవగాహన సమావేశానికి నిజాంపేట్ సర్కిల్ కు చెందిన నాయకులకు, బిఎల్ఏలకు అవగాహన సదస్సు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై Special intensive Revision (SIR) కార్యక్రమ నిర్వాహణ, పాటించవలసిన నియమ, నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఓటు విలువను ప్రతి పౌరుడికి తెలియజేస్తూ ప్రతీ ఓటర్, ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్ఏలు, నాయకులు బిఎల్ఓలు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలి.2002 జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం అద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ SIR కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు, డూప్లికేట్ ఓట్లు, పర్మినెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులు లేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం, కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, ఇంకా ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు, బిఎల్ఏలు, సంక్షేమ సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్స్, యువత ఒక బాధ్యతగా తీసుకొని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలనేలా పనిచేయాలన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా నాయకులు, బిఎల్ఏలు అప్రమత్తతో పనిచేయాలన్నారు.

అదేవిధంగా రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంకై చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లోకి ఎలా దూసుకువెళ్లాలనే చేపట్టవలసిన కార్యాచరణను వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు, పలు డివిజన్లకు చెందిన పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలు సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా నాయకురాల్లు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నిల్వ నీరు లేకుండా పరిశుభ్రత పాటిస్తేనే దోమల నివారణ జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా కాప్రా సర్కిల్‌లో విస్తృత అవగాహన కార్యక్రమాలు



కాప్రా, మే 16 (వెలుతురు):

డెంగ్యూ వ్యాధి నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించి దోమల పెరుగుదలను అరికట్టాలని అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ డి. రమేష్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని బిజెఆర్, జెమ్మిగడ్డ కాలనీలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ప్రతి సంవత్సరం మే 16న దేశవ్యాప్తంగా జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ప్రజల్లో డెంగ్యూ జ్వరంపై అవగాహన పెంపొందించడం, వ్యాధి వ్యాప్తిని నియంత్రించడం, ముందస్తు జాగ్రత్తలపై చైతన్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమయ్యే సమయంలో డెంగ్యూ కేసులు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా చూసుకోవడం, కూలర్లు, నీటి డబ్బాలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు వంటి వాటిలో నీరు నిల్వకాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వారానికి ఒకసారి నీటి ట్యాంకులను శుభ్రపరచడం, దోమతెరలు ఉపయోగించడం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు పాటిస్తే డెంగ్యూ వ్యాప్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.డెంగ్యూ లక్షణాలైన అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, కండరాల నొప్పులు, అలసట వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహాతోనే చికిత్స పొందాలని హెచ్చరించారు.ఈ సందర్భంగా బిజెఆర్, జెమ్మిగడ్డ కాలనీలలో ఇంటింటికీ తిరుగుతూ మలేరియా సిబ్బంది ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి డెంగ్యూ నివారణ చర్యలను వివరించారు. కాలనీల్లో పరిశుభ్రత నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, మలేరియా విభాగ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కాలే యాదయ్య జన్మదిన వేడుకలు






- **మెరిట్ విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతి నోట్‌బుక్స్ పంపిణీ**

శంకర్ పల్లి, వెలుతురు మే 16 :

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు మరియు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. శంకర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర, బాలికల పాఠశాలలతో పాటు తెలంగాణ మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. అదేవిధంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే కాలే యాదయ్య జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ చంద్ర మోహన్, కౌన్సిలర్లు గుండా శిరీష చంద్ర శేఖర్, గణేష్, సీహెచ్ అశోక్, ప్రశాంత్, ఆనంద్, కోఆప్షన్ సభ్యులు చెంగల్ బాలకృష్ణ రెడ్డి, రజని శ్రీనివాస్, మైమూద్, గోపాల్, మాజీ నాయకులు పార్సి బాలకృష్ణ, చంద్రమౌళి, మొయిన్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి




- **ఉచిత వైద్య శిబిరాన్ని కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చిన బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి.**

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మే 16:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 278 డివిజన్ గాజులరామారం,సుభాష్ చంద్రబోస్ నగర్ లోని 39 వ ఉచితంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి.తదనంతరం వారు మాట్లాడుతూ,

కాలని వాసులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మీడియా సమావేశంలో తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అహ్మద్,షేక్ సల్మాన్,మహమ్మద్ షఫీ, మహమ్మద్ మోహిన్,కావాలి గణేష్,గంట శివారెడ్డి,పృథ్వీ ,దేవేందర్ రెడ్డి, కిష్టారెడ్డి,మరియు బికెఆర్ ఫౌండేషన్ సభ్యులు,మరియు కాలని వాసులు పాల్గొన్నారు.

# పథకాల అమలుపై సమన్వయంతో పని చేయాలి

## ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచన

- సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలుకు సమన్వయం అవసరం
- దిశ అంటే అభివృద్ధి దిశగా ముందడుగు అని ఎంపీ వ్యాఖ్య
- కేంద్ర, రాష్ట్ర పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన
- అంగన్వాడీల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచన
- బాల్య వివాహాల నివారణకు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశం
- డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపులో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- బ్యాంకులు లక్ష్యాల మేరకు రుణాలు అందించాలని ఎంపీ ఆదేశం
- ముద్ర, విశ్వకర్మ పథకాలపై వేగవంతమైన రుణాల మంజూరు కోరారు
- అసంపూర్తి రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచన
- చేవెళ్ల పార్లమెంటు సభ్యులు, దిశ ఛైర్మన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి






రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 16:

జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, సబ్సిడీల వివరాలపై సంబంధిత శాఖలు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలు, మండలాలు, పట్టణ కేంద్రాల్లో సభల ద్వారా ప్రజలకు పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు.

అంగన్వాడీల్లో టీచర్లు, సిబ్బంది కొరత లేకుండా చూడాలని, పిల్లలకు పోషకాహారంగా గుడ్డుతో పాటు పాలు అందించాలని ఆదేశించారు.

జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖ అధికారికి సూచించారు.

అక్రమ మైనింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖను ఆదేశించారు.

మత్స్యకారులకు శిక్షణ ఇచ్చి అవసరమైన వలలు అందజేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి కల్పించాలని సూచించారు. అలాగే డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపులో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

బ్యాంకులు రుణాల విషయంలో లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాలకు విరివిగా రుణాలు అందించాలని, ముద్ర, విశ్వకర్మ పథకాల ద్వారా చిరు వ్యాపారులకు సత్వర రుణాలు మంజూరు చేయాలని కోరారు.

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.

ఈ సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

- డెంగ్యూ నిర్మూలన లక్ష్యంగా విస్తృత ప్రచార కార్యక్రమం
- డెంగ్యూ నివారణపై ప్రజల్లో చైతన్య సదస్సు
- ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించిన డా. శ్రీధర్
- నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచనలు
- దోమల నియంత్రణపై ప్రత్యేక అవగాహన
- వారానికి ఒక రోజు పొడి దినం పాటించాలని పిలుపు
- జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి
- స్వయంగా మందులు వాడొద్దని వైద్యుల సూచన
- వర్షా కాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు









హైదరాబాద్ వెలుతురు మే 16:

జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ నిర్మూలన లక్ష్యంగా హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ మరియు ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి నివారణ, నియంత్రణ, నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని జిల్లా టీకాల అధికారి డా. శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.

డెంగ్యూ వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదలను అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. పాత టైర్లు, డబ్బాలు, చల్లని గాలిపరికరాలు, పూల కుండీలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డెంగ్యూ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. వారానికి ఒకరోజు పొడి దినం పాటించడం, నీటి నిల్వలను పూర్తిగా తొలగించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా మేరకు మాత్రమే చికిత్స పొందాలని తెలిపారు.

వర్షాకాల నేపథ్యంలో డెంగ్యూ కేసులు పెరిగే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డా. జయశ్రీ, డా. వి. సాయిబాబా, డా. శ్రీకళ, డా. ఎ. అర్షితా రెడ్డి, జి. వెంకటేశ్వర్లు, పి. శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, ఎస్. అంజనేయులు, ఉప విభాగ అధికారులు, జిల్లా వైద్య కార్యాలయ సిబ్బంది, క్షేత్ర స్థాయి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెంగ్యూ నివారణకు సంబంధించిన కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు.

## నీట్ క్వశన్ పేపర్ తయారు చేసి లీక్ చేసిన కెమిస్ట్రీ ప్రొఫెసర్ కులకర్ణి, బొటనీ టీచర్ మనీషాలను కఠినంగా శిక్షించాలి



- భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా పరీక్షలన్ని ఆన్లైన్ లోనే నిర్వహించాలి.
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

హైదరాబాద్ వెలుతురు మే 16:

22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడి నీట్ పేపర్ లీక్ చేసిన కెమిస్ట్రీ ప్రొఫెసర్ కులకర్ణి బొటనీ టీచర్ మనీషాలకు జీవిత కాల శిక్ష వేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పేపర్ లీక్ చేయడం వల్ల ఇప్పటికే పరీక్ష రద్దు అయినందువల్ల ఇప్పటికే ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఈ చావులకు వీరే భాధ్యత వహించాలని అన్నారు. వీరిపై మర్డర్ కేసు నమోదు చేయాలని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన వేలకు వేల రూపాయలు ఖర్చుపెట్టి హాస్టల్లో ఉంటూ కోచింగ్ తీసుకున్న విద్యార్థుల శ్రమ వృధా అయినట్టేనని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పరీక్షలన్ని ఆన్లైన్ లో నిర్వహించాలని అన్నారు.

## మారాజు వీరన్న స్ఫూర్తితో తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

- జాజుల లింగంగౌడ్ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్

హైదరాబాద్ వెలుతురు మే 16:

విద్యార్థి దశ నుండే విప్లవ పాఠాలు నేర్చుకుని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు అక్రమాలపై ఎన్నో పోరాటాలు చేసి బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేసిన మారోజు వీరన్న 27వ వర్ధంతి సందర్భంగా ఆయన బలహీన వర్గాలకు నింపిన స్ఫూర్తిని ధైర్యాన్ని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ గుర్తు చేశారు.మేమెంతో మాకంత వాటా దక్కాలని జనాభాలో ఐదు శాతం లేని వారు ఎమ్మెల్యేలు ఎంపీలుగా ఎన్నికవుతూ 90 శాతం ఉన్నటువంటి అణగారిన వర్గాలను పరిపాలించడం ఏమిటని లింగంగౌడ్ ప్రశ్నించారు.ఒకసారి దళిత గిరిజన మైనార్టీ బడుగు బలహీన వర్గాల వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఈ సందర్భంగా అన్నారు.



# విద్యా విజయోత్సవంలో ప్రతిభావంతులకు ఘన సత్కారం





- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో విద్యా విజయోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.
- టాప్ టెన్ పదవ తరగతి విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం
- ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో టాప్ టెన్ విద్యార్థులకు పురస్కారాలు
- క్రీడా విభాగంలో టాప్ 3 విద్యార్థులను అభినందించిన అధికారులు

మేడ్చల్ వెలుతురు మే 16:

- ఉల్లాస్ వాలంటీర్లకు ప్రత్యేకంగా ఘన సన్మానం
- మొదటి మూడు ర్యాంకర్లకు రూ.10,000 నగదు పురస్కారం
- మెమెంటో, అప్రిషియేషన్ సర్టిఫికెట్లు అందజేత
- విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి
- స్కూల్ రోజుల అనుభవాలను పంచుకున్న కలెక్టర్
- విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ
- ఉపాధ్యాయులను ప్రశంసించిన జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి

కార్యక్రమంలో పదవ తరగతి టాప్ టెన్ విద్యార్థులు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో టాప్ టెన్ విద్యార్థులు, క్రీడా విభాగంలో టాప్ 3 విద్యార్థులు, అలాగే ఉల్లాస్ వాలంటీర్లను గౌరవ కలెక్టర్ మనుచౌదరి చేతుల మీదుగా సత్కరించారు.

మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.10,000 నగదు పురస్కారంతో పాటు మెమెంటో మరియు అప్రిషియేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. తాను పనిచేసిన ప్రతి జిల్లాలో ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

తన స్కూల్ రోజుల అనుభవాలను విద్యార్థులతో పంచుకోవడంతో కార్యక్రమం మరింత ఉత్సాహ భరితంగా మారింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఫోటో సెషన్స్‌లో కలెక్టర్ ఉత్సాహంగా పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ గర్వకారణమని తెలిపారు. జిల్లా ఫలితాల్లో కీలక పాత్ర పోషించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆమె అభినందించారు.

# కష్టకాలంలో చేయూతగా నిలిచిన సమ్మిగౌడ్ ఫౌండేషన్..





- **నాగేంద్ర చారి కుటుంబానికి 75 కిలోల బియ్యం పంపిణీ..**
- **అందుబాటులో లేకపోయినా అండగా నిలిచిన సేవాభావం..**
- **ఉప్పరపల్లి గ్రామంలో మానవత్వాన్ని చాటిన సమ్మిగౌడ్ ఫౌండేషన్ సభ్యులు**

**కేసముద్రం వెలుతురు మే 16**: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం లోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఎటురోజు నాగేంద్ర చారి భార్య ధనమ్మ బ్రెయిన్ స్ట్రోక్ తో మరణించిన విషయం తెలుసుకొని పరమార్శించిన సమ్మిగౌడ్ గారికి ఆ మరుసటి రోజు ధనమ్మ కుటుంబ ఆర్థిక పరిస్థితి త స్థానిక వార్డు సభ్యులు పద్మవెంకన్న, తండ సంపత్ లు మరియు ఫౌండేషన్ సభ్యులు సమ్మిగౌడ్ ఫౌండేషన్ చైర్మన్ సమ్మయ్య గౌడ్ కి విషయం తెలియజేయజేసి కొంత సహాయం అందించాలని కోరగా వెంటనే స్పందించిన సమ్మిగౌడ్ 75 కిలోల బియ్యాన్ని వారి ఫౌండేషన్ అనుచరుల తో స్థానిక గ్రామ వార్డు సభ్యులు, పెద్దల ద్వారా పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... "సమస్యల సమయంలో తోడు నిలిచే వారే నిజమైన మనుషులు" అని సమ్మిగౌడ్ ఫౌండేషన్ సేవలను అభినందించారు. కుటుంబానికి సమ్మిగౌడ్ ప్రత్యక్షంగా అందుబాటులో లేకపోయినా తమ వంతు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. నాగేంద్ర చారి తో పాటు ఆమె కుమారులు రాజు చారి, పరిపూర్ణ చారి, శరత్ చారిలకు ఫౌండేషన్ సభ్యులు ధైర్యం చెబుతూ, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఈ సేవా కార్యక్రమం మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమం లో 8వ వార్డు సభ్యురాలు పలుస పద్మ వెంకన్న గౌడ్, 9వ వార్డ్ సభ్యులు తండా సంపత్, గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకన్న, అడప రమేష్, నాలాగుర్తి ఉప్పలయ్య, కంది పాపయ్య, సత్యనారాయణ చారి, కట్ల పాపయ్య, కోమాకుల రమేష్, కంది సుధాకర్, మంద విక్రమ్, తండ రామయ్య, తండా శ్రీనివాస్, పబ్బతి సారంగం, గంట రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

# భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో ఘనంగా మారోజు వీరన్న 27వ వర్ధంతి




**నార్కట్ పల్లి వెలుతురు మే 16:** నార్కెట్‌పల్లి పట్టణ కేంద్రంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, పీడిత జన సామాజిక విప్లవకారుడు మారోజు వీరన్న 27వ వర్ధంతి సందర్భంగా భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, 1999 మే 16న కరీంనగర్ జిల్లా నర్సింగపురంలో ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో మారోజు వీరన్నను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారని పేర్కొన్నారు. భౌతికంగా దూరమైనప్పటికీ తెలంగాణ అస్తిత్వ పోరాటానికి, కుల వర్గాల హక్కుల సాధనకు ఆయన అందించిన సిద్ధాంతాలు నేటికీ ఆదర్శప్రాయమని అన్నారు. 90వ దశకంలోనే బీసీలు, నిమ్న వర్గాలకు రాజ్యాధికారం దక్కాలని ఉద్యమాన్ని నడిపిన నాయకుడు మారోజు వీరన్న అని కొనియాడారు. "బీసీలకు చదువు ఎందుకు వద్దని అగ్రవర్ణాలు ప్రశ్నిస్తే, పాటల రూపంలో సమాధానం చెబుతూ ఉద్యమాన్ని రగిలించిన విప్లవ వీరుడు వీరన్న" అని తెలిపారు. మారోజు వీరన్న రగిల్చిన ఉద్యమ స్ఫూర్తిని భీమ్ ఆర్మీ కొనసాగిస్తోందని, అగ్రవర్ణాల ఆధిపత్య కోటలను బద్దలు కొట్టి బీసీ రాజ్య స్థాపన సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వీరన్న ఆశయాల సాధనకై కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాకీ అర్జున్, చిరుమర్తి ఉపేందర్, ముప్పిడి కుమార్, బోడ రాఖీ, మంద విష్ణు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ వర్గానికి న్యాయం చేయాలి

- **తెలంగాణ విద్యా సంతుల వేదిక**
- **ప్రభుత్వ నిర్లక్ష్యంతో ముదిరాజ్ వర్గం తీవ్ర వెనుకబాటుతనం**
- **బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి వెంటనే మార్పు చేయాలని డిమాండ్**
- **ముదిరాజ్ సింహావిలోకనం రాష్ట్రస్థాయి సమాలోచన సదస్సుకు ఏర్పాట్లు**




**హైదరాబాద్ వెలుతురు మే 16:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ముదిరాజ్, ముత్తరాసి, తెనుగోళ్లు వర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారని తెలంగాణ విద్యా సంతుల వేదిక ఆందోళన వ్యక్తం చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఐదు దశాబ్దాలపాటు ముదిరాజ్ సామాజిక వర్గం తీవ్ర అంచివేత, విస్మరణకు గురైందని, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పరిస్థితుల్లో పెద్ద మార్పు రాలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తొలి అమరుడైన పోలీసు కిష్టయ్య బలిదానాన్ని ప్రభుత్వాలు గుర్తించలేదని విమర్శించారు. సీపెక్ -2025 కులాలవారీ జనాభా లెక్కల విశ్లేషణలో ముదిరాజ్ వర్గం వెనుకబాటుతనం అధికారికంగా బయటపడిందన్నారు. పాలనలో, ఎన్నికల టికెట్ల కేటాయింపులో, నామినేటెడ్ పోస్టుల భర్తీలో ముదిరాజ్ వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ ప్రయోజనాలు కూడా ముదిరాజ్ ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదని, విద్యారంగంలో డ్రాపవుట్ల శాతం అధికంగా ఉందని తెలిపారు. మత్స్యరంగంలో ఆదాయాలు తగ్గిపోవడంతో అనేక కుటుంబాలు దినసరి కూలీలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. సమ్మిళిత వెనకబాటుతనం సూచికలో రాష్ట్ర స్థాయి 81గా ఉండగా, ముదిరాజ్ వర్గం 94 పాయింట్లతో అత్యంత వెనుకబడిన వర్గంగా నమోదైందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం సుమారు రూ.4 లక్షలు ఉండగా, ముదిరాజ్ ప్రజల తలసరి ఆదాయం రూ.1 లక్షలోపే ఉందని వెల్లడించారు. రాష్ట్ర ఖజానాకు ముదిరాజ్ ప్రజలు 8 పైసలు ఆదాయంగా సమకూరుస్తున్నప్పటికీ, ప్రభుత్వ ఖర్చులో వారికి 3 పైసలు కూడా అందడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన బీసీడీ నుంచి బీసీఏ రిజర్వేషన్ మార్పు హామీ ఇప్పటివరకు అమలుకాలేదని, సుప్రీంకోర్టు ఆదేశాలు వచ్చిన రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సీపెక్ సర్వే ప్రకారం ముదిరాజ్ వర్గం సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా పరంగా ఎస్టీ, ఎస్సీ వర్గాల కంటే కూడా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో 7.4 శాతం ఉన్న ముదిరాజ్ ప్రజల వెనుకబాటుతనాన్ని తొలగించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ముదిరాజ్ సింహావిలోకనం' సదస్సు 26న "ముదిరాజ్ సింహావిలోకనం" పేరుతో రాష్ట్ర స్థాయి సమాలోచన సదస్సును ఈ నెల 26న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని గ్రాండ్ లాన్స్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్, పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సోషియల్ ఫిలాసఫర్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య, బీసీఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ టీ. చిరంజీవులు, సీనియర్ పాత్రికేయులు డాక్టర్ శివ కేశవులు ముదిరాజ్ పాల్గొంటారు. ఈ సందర్భంగా పిట్టల రవీందర్ రచించిన "ముదిరాజ్ ముఖచిత్రం" పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. సదస్సుకు ప్రొఫెసర్ సిహెచ్ దినేష్ కుమార్ ముదిరాజ్ అధ్యక్షత వహించగా, డాక్టర్ జూలు నాగేశ్వర్ ముదిరాజ్, డాక్టర్ కావలి చెన్నయ్య ముదిరాజ్ కన్వీనర్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే కృష్ణకిశోర్ ముదిరాజ్, పూల నాగరాజు, పిట్ల కిరణ్ ముదిరాజ్, డి.కె. మల్వార్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువుగట్టులో గిరి ప్రదక్షిణ ప్రారంభించిన ప్రకాష్ రెడ్డి






నార్కట్ పల్లి వెలుతురు మే 16: నార్కెట్‌పల్లి మండలం చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి అనుగ్రహంతో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గిరి ప్రదక్షిణ పూర్తి చేసి అనంతరం అభిషేకం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విహెచ్‌పీ నాయకుడు, నల్లగొండ జిల్లా ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ ఉంధ్యాల ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, చెరువుగట్టు ఆలయం ఎంతో పవిత్రమైనదని తెలిపారు. పరశురాముడు ప్రతిష్ఠించిన 108 శివలింగాలలో ఇదొకటిగా భావిస్తారని, ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ క్షేత్రం భక్తుల కోరికలను నెరవేర్చే పుణ్యక్షేత్రమని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ చేయడం వల్ల కోట్ల జన్మల పుణ్యం లభిస్తుందని, ప్రతి అమావాస్య రోజు ఉదయం 6:30 గంటలకు నిర్వహించే గిరి ప్రదక్షిణలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకోవాలని ఆయన కోరారు. చెరువుగట్టు దేవాలయం మొదటి మెట్టు నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఎల్లారెడ్డిగూడెం మీదుగా, నందుల నుంచి చెరువు కట్టపైగా తిరిగి దేవాలయానికి చేరిందని వివరించారు. జూన్ 15 సోమవారం మరోసారి గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి వెంకటయ్య, నాగరాజు, లింగస్వామి, కంబంపాటి శంకర్, వెంకటయ్య, వి. లోవిత్ చంద్రరెడ్డి, ఆంజనేయులు చారి, పిరికిపండ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అన్షిత్ రామ్ పుట్టినరోజున నిరుపేదలకు అన్నదానం




**నార్కట్ పల్లి వెలుతురు మే 16:** నార్కెట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి చెందిన సాయి మైత్రి మెడికల్ యజమాని రామోజు శ్రీకాంత్ - శ్రీనిధి దంపతుల కుమారుడు రామోజు అన్షిత్ రామ్ జన్మదిన సందర్భంగా "మనం స్వచ్ఛంద సంస్థ"లో నిత్య ఉచిత భోజన కార్యక్రమంలో భాగంగా 556వ రోజు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలు, నిస్సహాయులు, బిక్షాటన చేసేవారు, బాటసారులకు భోజనాలు అందజేశారు. "మనం" సంస్థలో ఇది తమ కుటుంబం తరఫున 5వ సారి అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. రామోజు నాగచారి మాట్లాడుతూ, తమ కుటుంబంలో ప్రతి ముఖ్యమైన రోజును పేదల ఆకలి తీర్చేందుకు వినియోగించడం ఆనందంగా భావిస్తున్నామని అన్నారు. "ఈ సృష్టిలో ఆకలికంటే పెద్ద లోటు ఇంకొకటి లేదు. ఆకలితో ఎవరూ బాధపడకూడదు" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామోజు సుజాత, నార్కెట్‌పల్లి మైత్రి మెడికల్ నాగచారి, రవి (బాలాజీ), కాసం సాయి కుమార్, కోడి ప్రశాంత్, విక్రమాచారి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ నామిరెడ్డి వెంకట్ రామ్ రెడ్డి మృతికి చిరుమర్తి లింగయ్య నివాళి



**నార్కట్ పల్లి వెలుతురు మే 16:** తిప్పర్తి మండలం జొన్నలగడ్డగూడెం గ్రామ మాజీ సర్పంచ్ నామిరెడ్డి వెంకట్ రామ్ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా, వారి మృతదేహాన్ని నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వెంకట్ రామ్ రెడ్డి మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# గుండాల ఎస్ఐకి అంబేద్కర్ చిత్రపటం అందజేత





**గుండాల మే 16 (వెలుతురు):** గుండాల మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ఎం.శోభన్‌బాబును కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డా. జేరిపోతుల పరశురామ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాన్ని ఆయనకు బహుకరించారు. ఈ సందర్భంగా డా. జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ "సత్యమేవ జయతే" స్ఫూర్తితో ప్రజలకు అందుబాటులో ఉండే మానవతావాది, మంచి అధికారి మా మండలానికి రావడం ఆనందంగా ఉందన్నారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్ఐ శోభన్‌బాబు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కచ్చిగళ్ల యాదగిరి, కొమ్మగళ్ల నాగార్జున్, సీహెచ్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# శని అమావాస్య వేడుకల్లో దత్తగిరి క్షేత్రానికి మంత్రి దామోదర సందర్శన

- శనైశ్వర స్వామికి తైలాభిషేకం.. జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు...
- పీఠాధిపతుల ఘన సన్మానం.. భారీగా తరలివచ్చిన భక్తులు...

**జహీరాబాద్ వెలుతురు మే 16:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామంలోని ప్రసిద్ధ దత్తగిరి క్షేత్రంలో శని అమావాస్య, శనైశ్వర స్వామి జయంతి, కళ్యాణోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మంత్రి దత్తగిరి క్షేత్రానికి చేరుకోగా ఆశ్రమ పీఠాధిపతులు, ఆలయ నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ



శనైశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని అష్టోత్తర సహస్ర తిల తైల ఘట్టాభిషేక యజ్ఞంలో పాల్గొన్నారు. శనైశ్వర స్వామి, జేష్టాదేవి వారి కళ్యాణోత్సవంలో పాల్గొని పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత క్షేత్రంలోని జ్యోతిర్లింగాల వద్ద రుద్రాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖ



శాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి స్వాములు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ అల్లాడి వీరేశం మంత్రిని శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీ దత్తాత్రేయ స్వామి కృపాకటాక్షాలతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

శని అమావాస్య, జయంతి సందర్భంగా దత్తగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. తెలంగాణతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ ప్రాంతం నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి, మొగుడంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

# బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శిగా అడిచెర్ల రాజు

**కరీంనగర్ వెలుతురు మే 16:** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన అడిచెర్ల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి తెలంగాణ రాష్ట్ర పార్టీ నియామకపు ఉత్తర్వుల ప్రకటన విడుదల చేసింది. ఓబిసి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అడిచెర్ల రాజు మాట్లాడుతూ తన పై నమ్మకంతో ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీలో రాష్ట్ర కార్యదర్శి ఆఫీస్ బేరర్ గా అవకాశం కల్పించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి



సంజయ్ , రాష్ట్ర అధ్యక్షులు రామ చంద్ర రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణా రెడ్డి లతోపాటు నా నియామకానికి సహకరించిన కరీంనగర్ జిల్లా రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నాయకులకు మిత్రులు శ్రేయోభిలాషులు కార్యకర్తలకు అందరికీ అడిచెర్ల రాజు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కోసం , ఓబీసీ మోర్చా బలోపేతం కోసం తన వంతు శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.

# ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై జహీరాబాద్‌లో ఎంఐఎం ముఖ్య నేతల సమావేశం



- ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు కౌసర్ మోహిఉద్దీన్ సూచన...

**జహీరాబాద్ వెలుతురు మే 16:** ఆల్ ఇండియా మజ్లిస్‌ఇత్తెహాద్‌ఉల్ ముస్లిమీన్ అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు జహీరాబాద్‌లో పట్టణంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కార్వాన్ ఎమ్మెల్యే, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కౌసర్ మోహిఉద్దీన్ తో పాటు బేరిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ వ్యక్తిగత కార్యదర్శి సయ్యద్ ముస్తాక్ అహ్మద్ హాజరయ్యారు. వారిని జహీరాబాద్ ఎంఐఎం అధ్యక్షుడు మహమ్మద్ అతర్ అహ్మద్ ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా జూన్ నెల నుంచి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై పార్టీ నాయకులు, మీడియా ప్రతినిధులకు కౌసర్ మోహిఉద్దీన్ మరియు సయ్యద్ ముస్తాక్ అహ్మద్ వివరించారు. ఈ కార్యక్రమం లక్ష్యాలు, ప్రజలకు కలిగే ప్రయోజనాలు, చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. పార్టీ బాధ్యులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుని ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం జహీరాబాద్ ఎంఐఎం అధ్యక్షుడు మహమ్మద్ అతర్ అహ్మద్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజల మధ్యకు వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఖాజా నిజాముద్దీన్, జిల్లా కార్యదర్శి మొహియుద్దీన్ ఘోరీ, సదాశివపేట అధ్యక్షుడు షేక్ ఘౌస్ పాషా, బీదర్ సిటీ అధ్యక్షుడు శఫీయుల్లా బేగ్, కోహీర్ అధ్యక్షుడు, కౌన్సిలర్ మహమ్మద్ రఫీ, దిగ్వాల్ అధ్యక్షుడు మహమ్మద్ వాజిద్, జహీరాబాద్ టౌన్ జాయింట్ కార్యదర్శి షేక్ ఇలియాస్‌తో పాటు వివిధ వార్డుల అధ్యక్షులు, పార్టీ నాయకులు మహమ్మద్ షరీఫ్, అబ్దుల్ నబీ, ఫయ్యాజ్, సమీర్, అబ్బాస్, ఫారూఖ్, బాబర్, మొయిన్, షంషోద్దీన్, సాజిద్, జమీల్, ఇస్మాయిల్, ఖాసిం అలీ, షోయబ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

# శని అమావాస్య సందర్భంగా ఎడకులపల్లి ఆలయంలో ఎమ్మెల్యే మాణిక్ రావు ప్రత్యేక పూజలు





**జహీరాబాద్ వెలుతురు మే 16:** శని అమావాస్య పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు ఝరాసంగం మండలం ఎడకులపల్లి ఆలయాన్ని సందర్శించి శనిదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలని శనిదేవుని ఆశీస్సులు కోరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు మరియు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, జీర్లపల్లి సర్పంచ్ అమరేశ్వరి శివమణి, హోతి బి గ్రామ సర్పంచ్ మచ్చేందర్, ఝరాసంగం సర్పంచ్ బాల్ రాజ్, జహీరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ మహిపాల్, మండల నాయకులు వెంకట్ రెడ్డి, ప్రభు పటేల్, నవాజ్ రెడ్డి, విజయ్ పటేల్, రామ్ రెడ్డి, శ్రీకాంత్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బండి సంజయ్‌పై దుష్ప్రచారం ఆపకపోతే కోర్టు ధిక్కరణ కేసులు ఖాయం

- అసత్య ప్రచారాలు వెంటనే తొలగించాలి...
- లేకపోతే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు...
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్....

**జహీరాబాద్ వెలుతురు మే 16 :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను రాజకీయంగా దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని సంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి భగీరథ్ కేసును అడ్డం పెట్టుకుని బండి సంజయ్ ప్రతిష్టను దెబ్బతీయడానికి కుట్రపూరితంగా సోషల్ మీడియా, డిజిటల్ వేదికలు, పత్రికలు, పోస్టర్ల ద్వారా తప్పుడు ప్రచారం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. శనివారం మొగుడంపల్లిలో మీడియాతో



మాట్లాడుతూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఈ వ్యవహారంపై కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బండి సంజయ్‌పై దుష్ప్రచారం చేస్తూ ప్రసారం చేసిన వీడియో క్లిప్పింగులు, పత్రికా కథనాలు, డిజిటల్ కంటెంట్, వ్యంగ్య కార్టూన్లు, వాల్ పోస్టర్లు తదితరాలను తక్షణమే తొలగించాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఈ నెల 26వ తేదీ లోపు అన్ని రకాల అపవాదు కంటెంట్‌ను పూర్తిగా తొలగించాల్సిందేనని, లేనిపక్షంలో కోర్టు ధిక్కరణ కింద కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేసే వారిపై పోలీసులు, న్యాయవ్యవస్థ కఠినంగా వ్యవహరిస్తాయని స్పష్టం చేశారు. రాజకీయంగా బండి సంజయ్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే కొందరు సోషల్ మీడియాను ఆయుధంగా ఉపయోగిస్తూ ఎడిట్ చేసిన వీడియోలు, తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని నౌబాద్ జగన్నాథ్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడానికి అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. ఇకపై ఎవరైనా బండి సంజయ్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ నిరాధార ఆరోపణలు చేస్తే బీజేపీ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని స్పష్టం చేశారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, కోర్టు ఆదేశాలను అతిక్రమిస్తూ దుష్ప్రచారం కొనసాగిస్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# హుగ్గెల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యం

- ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి....
- జహీరాబాద్ రూరల్ ఎస్ఐ కాశీనాథ్...

**జహీరాబాద్ వెలుతురు, మే 16:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామానికి చెందిన కుమారి జంబూల అపర్ణ అనే యువతి అదృశ్యమైనట్లు జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ఎం. కాశీనాథ్ శనివారం సాయంత్రం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అపర్ణ (21), తండ్రి



నర్సింలు, ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన యువతి. ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తూ కుటుంబంతో కలిసి హుగ్గెల్లి గ్రామంలో నివాసం ఉంటోంది. ఈ నెల 11వ తేదీన ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన అపర్ణ తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారని పేర్కొన్నారు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, పరిసర గ్రామాలు మరియు తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. అనంతరం ఆమె తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు. అపర్ణ ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నలుపు రంగు, తెల్లని పూల డిజైన్ గల పంజాబీ డ్రస్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆమె ఎత్తు సుమారు 5.2 అడుగులు ఉండగా, చామనచాయ వర్ణం, గుండ్రని ముఖం కలిగి ఉందని పేర్కొన్నారు. అపర్ణ ఆచూకీ తెలిసిన వారు వెంటనే జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ కాశీనాథ్ విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించాల్సిన **ఫోన్ నంబర్లు: 8712661847, 8712656764, 8712656731.**

# ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్‌కు హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు చేయాలి


- ఖేడ్ ఎంఐఎం పార్టీ మొహీద్ పటేల్


**వెలుతురు నారాయణఖేడ్ మే 16 : సంగారెడ్డి జిల్లా** : నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ప్రీ ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఎంఐఎం నారాయణఖేడ్ అధ్యక్షులు, న్యాయవాది మొహీద్ పటేల్ శుక్రవారం




సబ్ కలెక్టర్ ఐఏఎస్ ఎన్. ఉమా హారతి గారిని కోరారు. ప్రతి ఓటరుకు అవగాహన కల్పించి మ్యాపింగ్ పూర్తి చేసుకునేలా సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ త్వరలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి





- సామాన్య ప్రజల పైన మోయలేని భారం
- కమ్యూనిస్టులు లీడర్ చిరంజీవి

**వెలుతురు నారాయణఖేడ్ మే 16 :** సంగారెడ్డి జిల్లా : నారాయణఖేడ్ నియోజకవర్గం లో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని ఇది పేదల పైన మోయలేని భారం అన్నారు కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు నడ్డిని విచ్చే విధంగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఉన్నాయన్నారు ఇప్పటికే సామాన్యుడు కొనలేని పరిస్థితిలో అనేక వస్తువులు ఉన్నాయన్న ప్రభుత్వం పెంచిన పెట్రోల్ గ్యాస్ ధరలు వెంటనే తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు కొనడానికి సామాన్య ప్రజలు అందనంత దూరంలో ఉన్నారు ఇలా రేట్లు పెట్రోల్ డీజిల్ పెరగడంతో ప్రతి వస్తువు పైన కూడా భారంపదే విధంగా ఉందన్నారు కావున కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలను గ్యాస్ ధరలను తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు అంబేద్కర్ పూలే సంఘం డివిజన్ అధ్యక్షులు నర్సింలు మోహన్ బాలు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వలస గొర్రెకాపరుల వలలు, సామగ్రి అగ్నికి ఆహుతి



- బాధిత కుటుంబాలకు సహాయం చేయాలని విజ్ఞప్తి

**వెలుతురు నారాయణఖేడ్ మే 16 :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండలానికి చెందిన వలస గొర్రెకాపరులు గొర్రెల మేత కోసం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తాడుకోల్ చౌరస్తా సమీపంలోని గుడిమ్య గ్రామ శివారుకు వెళ్లారు. అక్కడ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గొర్రెల చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేసిన వలలకు అకస్మాత్తుగా మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో గొర్రెకాపరుల వలలు, బట్టలు, దుప్పట్లు మరియు ఇతర అవసరమైన సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ అప్పటికే భారీ నష్టం సంభవించింది. ఈ ప్రమాదంతో వలస గొర్రెకాపరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మరియు దాతలు ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మనమందరం కలిసి ఆ వలస గొర్రెకాపరులకు సహాయం చేయాలని సామాజిక వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీ నిరసన

- ధరల పెంపుతో ప్రజల నడ్డి విరిచిన కూటమి ప్రభుత్వం
- ఎన్నికల హామీలను విస్మరించిందని టీడీపీపై విమర్శలు
- దేశంలోనే అధిక ధరలకు ఇంధన విక్రయాలు జరుగుతున్నాయన్న కాటసాని
- రైతాంగం, రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన
- ఈ నెల 18న బనగానపల్లెలో నిరసన కార్యక్రమం
- తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపు
- మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పణ
- జగన్ ఆదేశాల మేరకు ఆందోళన చేపడుతున్నట్లు వెల్లడి
- వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనాలని పిలుపు
- ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తామని హెచ్చరిక




**బనగానపల్లె వెలుతురు మే 16:** బనగానపల్లె పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఆందోళనకరమన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఇంధన ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన తెలుగు దేశం పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించిందని విమర్శించారు. దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే అధిక ధరలకు పెట్రోల్, డీజిల్ విక్రయించడం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మళ్లీ ధరలు పెంచడం ద్వారా సామాన్యులపై భారీ భారం పడుతోందన్నారు. రైతాంగం, రవాణా రంగాలపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ ఈ నెల 18వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు బనగానపల్లెలో మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. బనగానపల్లె నియోజకవర్గంలోని అన్ని మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల సభ్యులు, సోషల్ మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం.. శేరిలింగంపల్లిలో అవగాహన ర్యాలీ




- జాతీయ డెంగ్యూ దినోత్సవం ఘనంగా నిర్వహణ
- పీహెచ్‌సీ శేరిలింగంపల్లిలో కార్యక్రమం నిర్వహణ
- వైద్య అధికారులు, ఆశా కార్యకర్తల హాజరు
- జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది సమన్వయం
- వర్షా కాలంలో డెంగ్యూ నియంత్రణపై సూచనలు
- ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహణ
- సిగ్నల్ నుండి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ
- కేసులపై సమీక్ష చేసిన రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి
- లార్వా నియంత్రణ చర్యలపై ప్రత్యేక ఆదేశాలు
- సమాజ భాగస్వామ్యంతో నియంత్రణకు పిలుపు

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 16:** శేరిలింగంపల్లిలో 16 మే 2026న జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, ఫీల్డ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు, రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి (ఎన్‌సీవీబీడీసీ) డా. అమర్ సింగ్ నాయక్ హాజరై రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ చర్యలపై సూచనలు చేశారు.

సెరిలింగంపల్లి సిగ్నల్ నుండి రైల్వే స్టేషన్ వరకు ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు మరియు జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

డా. అమర్ సింగ్ నాయక్ డెంగ్యూ కేసుల పరిస్థితిని సమీక్షించి, నియంత్రణ చర్యలు మరింత బలోపేతం చేయాలని సూచించారు. డెంగ్యూ పాజిటివ్ కేసులు గుర్తించిన ప్రాంతాల్లో 50 ఇళ్ల పరిధిలో పైరెథ్రం ఇండోర్ స్పేస్ స్ప్రేలు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే నీటి నిల్వలు, అపరిశుభ్ర ప్రాంతాలు, హైసింత్ మొక్కలతో నిండిన చెరువులు, కాలువలు వంటి దోమల పెరుగుదలకు అనుకూల ప్రాంతాలను గుర్తించి జీపీఎస్ లొకేషన్ వివరాలు సేకరించాలని సూచించారు. ఆశా కార్యకర్తలకు యాంటీ లార్వల్ ఆపరేషన్స్‌పై అవగాహన కల్పించి, ఉపయోగించని నీటి డ్రమ్‌లు, కూలర్లు, ప్లాస్టిక్ కంటైనర్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. ఉమా దీపిక ఫీల్డ్ సిబ్బంది కొరతపై దృష్టి సారించాలని కోరారు. డెంగ్యూ, మలేరియా ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు ఆశా కార్యకర్తలు మరియు ఏఎన్‌ఎంలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సమాజ భాగస్వామ్యం, క్షేత్రస్థాయి పర్యవేక్షణతో డెంగ్యూ నియంత్రణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం: మంత్రి జూపల్లి కృష్ణారావు





- డయాలసిస్ కేంద్రానికి నేటి నుంచి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా
- ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

**కొల్లాపూర్, వెలుతురు మే 16:** పేద, మధ్యతరగతి ప్రజలు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ వైద్యశాలల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరిస్తూ, ఆసుపత్రికి నేటి నుంచే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి ప్రకటించారు. ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ దవాఖానాల్లోనే అన్ని వసతులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా ఆధునిక వైద్య సేవలు, పరీక్షలు, నాణ్యమైన మందులు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిలో త్వరలోనే పూర్తిస్థాయి సేవలను మరింత విస్తృతం చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ అంతరాయం కారణంగా డయాలసిస్ రోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వారి కోసం ప్రత్యేక విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయించినట్లు మంత్రి వెల్లడించారు. నేటి నుంచి ఎలాంటి బ్రేక్ లేకుండా 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీనివల్ల రోగులకు సకాలంలో, సురక్షితంగా వైద్యం అందుతుందన్నారు. అలాగే డయాలసిస్ కేంద్రంలో అదనపు బెడ్లు, ఏసీల ఏర్పాటుతో పాటు రోగుల కోసం ప్రత్యేకంగా మరో అంబులెన్స్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. గత 2018 సంవత్సరంలో రూ.22 కోట్ల వ్యయంతో మంజూరైన 100 పడకల నూతన ఆసుపత్రి భవన పనులు పూర్తయ్యాయని, త్వరలోనే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా దీనిని ప్రారంభించనున్నట్లు జూపల్లి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ఆసుపత్రి వద్ద రూ.5 లక్షల వ్యయంతో నూతన బస్ షెల్టర్ నిర్మిస్తున్నామని, స్థానిక ప్రజాప్రతినిధులు ఆసుపత్రిని నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు అండగా ఉండాలని మంత్రి సూచించారు.

# ఆన్‌లైన్ క్లాసులకు ప్రొజెక్టర్లు పంపిన సీఎం






- సంగారెడ్డి బాలికల జూనియర్ కళాశాలలో ప్రొజెక్టర్ టీవీల ప్రారంభం
- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

- ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి
- ఆన్‌లైన్ క్లాసులతో విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు
- రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలకు టీవీలు పంపిన ప్రభుత్వం
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నిర్మల జగ్గారెడ్డి
- అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల సన్మానం
- డిజిటల్ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత
- బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**సంగారెడ్డి వెలుతురు మే 16:** సంగారెడ్డి పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఆన్‌లైన్ క్లాసుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాలుగు ప్రొజెక్టర్ టీవీలను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విద్యకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని కళాశాలలకు ఆన్‌లైన్ క్లాసుల కోసం టీవీలు పంపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి బాలికల జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, ప్రిన్సిపాల్ సునీత, లెక్చరర్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# S.I.R పట్ల పూర్తి అప్రమత్తతో ఉంటాం



- అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలిగించకుండా బూత్ లెవెల్ లో జాగ్రత్త చర్యలు చేపడతాం
- క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం పై ప్రత్యేక దృష్టి సారించి..ప్రణాళిక ప్రకారం వెళ్తున్నాం
- కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్లగొండ జిల్లా కంచుకోట
- భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ స్థానాలు అధికారంలో లేనప్పుడు గెలిచాం, ఇప్పుడూ భారీ మెజార్టీతో గెలుచుకున్నాం..
- నామినేటెడ్,కార్పోరేషన్ పదవుల్లో 20,30 ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్న వారికి ఇవ్వాలి
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ జూమ్ మీటింగ్ లో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిపాదన పట్ల పూర్తి సానుకూలత వ్యక్తం చేసిన ఏఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్
- పార్టీ కోసం కష్టపడే వాళ్ళకే పదవులు మీరు పార్టీలో సీనియర్ నాయకులు, సీనియర్ మంత్రి - మీనాక్షి నటరాజన్
- నామినేటెడ్ పదవుల కోసం అర్హులైన వారి పేర్లు మీరు ఇవ్వండి అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారికి సూచించిన ఇంచార్జి మీనాక్షి నటరాజన్
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ కోసం కష్టపడుతున్న సీనియర్ నాయకులు చాలా మంది ఉన్నారు.
- మంత్రి ఉత్తమ్, సీనియర్ నేత జానారెడ్డి తో సమాలోచనలు చేసి వారి జాబితా ఇస్తామన్న మంత్రి కోమటి రెడ్డి

హైదరాబాద్ వెలుతురు మే 16:
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) S.I.R ,బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం అంశాలపై AICC ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్,TPCC ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్,AICC సెక్రటరీ సచిన్ సావంత్ ఆధ్వర్యంలో జరిగిన జూమ్ మీటింగ్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ జూమ్ మీటింగ్ కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు,పార్టీ సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) S.I.R కు సిద్ధంగా ఉందామని జూమ్ మీటింగ్ లో పాల్గొన్న అందరు ముక్త కంఠంతో తీర్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు పలు సూచనలు చేశారు...

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో నల్లగొండ, భువనగిరి లోక్‌సభల్లో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ పార్టీ శ్రేణులు సన్నద్ధంగా ఉన్నది. అందుకు బూత్ లెవల్ కమిటీ -బాధ్యతలు తీసుకోవాలి.

ఎన్నికల సంఘం ..పరోక్షంగా ప్రతి నియోకవర్గంలో ఇన్ని ఓట్లు తీసేయాలి..అనే నిబంధన విధించే అవకాశం ఉంది. అందులో కొన్ని వర్గాలు నివసించే ప్రాంతాలపై ఫోకస్ చేసే అవకాశం ఉంది. వాస్తవానికి బీఎల్ఒలు ఇంటింటి పరిశీలన చేయాలి. ఒకటికి రెండు,మూడు మార్లు వెళ్లి పరిశీలన చేసిన తర్వాత డబుల్ ఓటు, మరణించిన లేదా వలస వెళ్లిన అంశాలను ధృవీకరించుకుని సవరించాలి. అవేవి లేకుండా కార్యాలయాల్లో కూర్చుని చేసే అవకాశం ఉంది. ఓటును తొలగించే క్రమంలో అందుకు కారణాలను వివరిస్తూ ..నోటీసులు ఇవ్వాలి. అకారణంగా తొలగింపునకు గురైన ఓటర్లకు తిరిగి అప్పీల్ చేసుకోవటం, ధరకాస్తు చేసుకునేందుకు మూడు నెలల సమయం ఖచ్చితంగా ఇచ్చేలా ఎన్నికల కమీషన్, జిల్లా కలెక్టర్లకు పార్టీ తరపున విజ్ఞప్తి చేయాలి. పార్టీ పరంగా తీసుకుంటే.. ప్రతి బూత్ స్థాయిలో జరిగే కసరత్తుకు పార్టీ కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ బాధ్యతలు పని విభజన చేసుకుని ,,బూత్‌స్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలి. వారు పర్యటించే సమయాల్లో వారితో పాటు కలిసి ఇంటింటి పరిశీలన చేసి.. ఓటరు -ఇంటి వారిగా సమీక్ష చేయాలి.

ఒక వేళ అధికారులు ఉద్దేశపూర్వకంగా తొలగిస్తే బూత్ అధికారి నుండి ఆర్ఒడీ, జిల్లా కలెక్టర్‌నుండి రాష్ట్ర ఎన్నికల కమీషన్ వరకు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌ఫిర్యాదులు చేయాలి.దీని కోసం ప్రతి శాసనసభ మండలం, నియోజకవర్గం వారిగా ఫిర్యాదులు కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జానా రెడ్డి,ఇతర సీనియర్ నాయకులం అందరం దీనిపై సీరియస్‌గా ఉంటాం..ఏమైనా ఇబ్బంది అనుకుంటే పార్టీ తరుపున పోరాటాలు చేసేందుకు వెనుకాడం. ఈ సవరణ కార్యక్రమం జరిగినన్నీ రోజులు.. ప్రతి రోజు అప్రమత్తంగా ఉండాలి.అందుకోసం ప్రతి వారం ప్రత్యేక సమీక్ష నిర్వహించుకుని కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, సాధారణ ప్రజల ఓట్లను రద్దు చేయకుండా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలి. ఇందులో క్రియాశీలకంగా పనిచేసే కార్యకర్తలు,నాయకులను పార్టీ గుర్తించి తగు ప్రాధాన్యత ఇస్తుంది.

- S.I.R పట్ల పూర్తి అప్రమత్తతో ఉంటాం..అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలిగించకుండా బూత్ లెవెల్ లో జాగ్రత్త చర్యలు చేపడతాం
- క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం పై ప్రత్యేక దృష్టి సారించి..ప్రణాళిక ప్రకారం వెళ్తున్నాం
- కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్లగొండ జిల్లా కంచుకోట
- భువనగిరి,నల్లగొండ పార్లమెంట్ స్థానాలు అధికారంలో లేనప్పుడు గెలిచాం..ఇప్పుడూ భారీ మెజార్టీతో గెలుచుకున్నాం..

నామినేటెడ్,కార్పోరేషన్ పదవుల్లో 20,30 ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్న వారికి ఇవ్వాలి" అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిపాదన పట్ల పూర్తి సానుకూలత వ్యక్తం చేసిన ఏఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్..పార్టీ కోసం కష్టపడే వాళ్ళకే పదవులు..మీరు పార్టీలో సీనియర్ నాయకులు,సీనియర్ మంత్రి..నామినేటెడ్ పదవుల కోసం అర్హులైన వారి పేర్లు మీరు ఇవ్వండి అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారికి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ కోసం కష్టపడుతున్న సీనియర్ నాయకులు చాలా మంది ఉన్నారు..మంత్రి ఉత్తమ్, సీనియర్ నేత జానారెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో సమాలోచనలు చేసి వారి జాబితా ఇస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి బలమైన వేదిక – మంత్రి సీతక్క

- **ప్రజాభవన్‌లో ఘనంగా స్త్రీనిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం**

**హైదరాబాద్ వెలుతురు మే 16:** ప్రజాభవన్‌లో స్త్రీనిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక (Annual Action Plan) అమలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, స్త్రీనిధి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






ఈ సందర్భంగా స్త్రీనిధి ఉద్యోగులంతా కలిసి స్త్రీనిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ను ఏర్పాటు చేసుకోగా, మంత్రి సీతక్క అభినందించారు. సంఘం ఉద్యోగులను ఐక్యం చేయడమే కాకుండా, హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ప్రయోజనాలతోపాటు లక్షలాది మహిళల ఆర్థిక సంక్షేమాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలను కూడా నిర్దేశించింది. స్త్రీనిధి సంస్థ మన ఇల్లు లాంటిది. సంస్థను కాపాడుకుంటేనే ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయి" అన్నారు. 2011లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీనిధి, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మరింత బలోపేతం అవుతోందన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికే స్త్రీనిధి ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు స్త్రీనిధి ద్వారా 32 లక్షల మందికి పైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించడం గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. స్త్రీనిధి అసలు సిసలు మాహిళా బ్యాంక్ అని కొనియాడారు. తెలంగాణ మహిళలకు స్త్రీనిధి ఒక నమ్మకమైన బ్యాంక్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ స్త్రీనిధి మోడల్‌ను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పారు.

"కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం. ఆ దిశగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. మహిళల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అనే నమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది" అని మంత్రి తెలిపారు. దేశ జీడీపీలో మహిళల భాగస్వామ్యం ప్రస్తుతం 18 శాతానికే పరిమితమైందని, అభివృద్ధి చెందిన దేశాల్లో అది 40 శాతానికి చేరుకుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ మహిళలు కూడా ఆ స్థాయికి ఎదగాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ముఖ్యంగా గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరుస్తున్నామని తెలిపారు. స్త్రీనిధి సంస్థపై కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం పనిచేస్తున్న సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడానికి కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అలాంటి ఆరోపణలపై వాస్తవాలను ఉద్యోగులు స్పష్టం చేయాలన్నారు. గత ప్రభుత్వంలో 16 మంది ఉద్యోగులను తొలగించారని, ఇప్పుడు అదే వ్యక్తులు తప్పుడు ఆరోపణలతో సంస్థను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అలాంటి అసత్య ప్రచారాన్ని ఉద్యోగులంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. "మాది ఉద్యోగ అనుకూల ప్రభుత్వం. స్త్రీనిధిలో ఒక్కరిని కూడా తొలగించలేదు. ఇప్పటికే పదోన్నతులు, బదిలీలు పూర్తి చేశాం. సెర్ప్‌లో వంద శాతం బదిలీలు నిర్వహించాం. స్త్రీనిధిని బలోపేతం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం తప్ప, ఎవరి ఉద్యోగాలను తొలగించడం కాదు" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. స్త్రీనిధి సంస్థ ఏర్పాటులో, దాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో కృషి చేసిన ఎండీ విద్యాసాగర్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న విద్యాసాగర్ రెడ్డిని మంత్రి సీతక్క, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. నూతన నాయకత్వంలో స్త్రీనిధి సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. "స్త్రీనిధి మహిళల కోసం, మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థ. దీనిని కాపాడుకుంటూ మహిళల ఆర్థిక అభివృద్ధికి మరింత బలోపేతం చేయాలి" అని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# అంబేద్కర్ కళాభవన్ పనులను పరిశీలించిన మంత్రి జూపల్లి

- **రూ.3 కోట్లతో నిర్మాణం.. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం**

**కొల్లాపూర్, వెలుతురు మే 16:** సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'అంబేద్కర్ కళాభవన' నిర్మాణ పనులను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. శనివారం ఆయన నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి, పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన నమూనాను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా, నిర్దేశిత గడువులోగా నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. స్థానిక కళాకారుల ప్రతిభా ప్రదర్శనలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ కళాభవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. పనుల్లో వేగం పెంచాలని, నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,



వివిధ విభాగాల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో ఫీడర్ ఛానల్ కాలువ పునరుద్ధరణ

- **ఫీడర్ ఛానల్ కాలువ పునరుద్ధరణతో ఎలగలగూడెం, జక్కలవారి గూడెం, మునుగోడు పెద్ద చెరువులకు నేరుగా నీరు**

**మునుగోడు వెలుతురు మే 16:** పలివెల నుండి ఎలగలగూడెం మీదుగా జక్కల వారి గూడెం చెరువు కు అక్కడి నుండి మునుగోడు పెద్ద చెరువుకు వచ్చే ఫీడర్ ఛానల్ కాలువ మట్టి,కంప చెట్లతో మూసుకుపోయి నీరు రావడానికి ఇబ్బందిగా ఉన్న విషయాన్నీ స్థానిక నేతలు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారి దృష్టికి తీసుకురాగా వెంటనే ఫీడర్ ఛానల్ కాలువను ఎంత ఖర్చైనా పునరుద్ధరించాలని వ్యక్తిగత సిబ్బంది ని ఆదేశించారు రాజ్ గోపాల్ రెడ్డి వ్యక్తిగత సిబ్బంది స్థానిక నాయకులు కలిసి పునరుద్ధరణ పనులు ప్రారంభించారు.. పలివెల గ్రామం నుండి వెలగల గూడెం చెరువు వరకు అక్కడినుండి జక్కల వారి గూడెం చెరువు వరకు అక్కడనుండి మునుగోడు పెద్ద చెరువు వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర ఉన్న ఫీడర్ ఛానల్ కాలువ పూడికతోపాటు కంప చెట్లను తొలగిస్తున్నారు... ఈ పనుల వల్ల రాబోయే వర్షాకాలంలో చెరువులు నిండే అవకాశం ఉండడంతో రాజగోపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి జక్కలి రాజు యాదవ్ నియామకం

- **మునుగోడులో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యం: రాజు యాదవ్**

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు మే 16:** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జక్కలి రాజు యాదవ్ రెండోసారి నియమితులయ్యారు. తనపై నమ్మకంతో మరోసారి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జక్కలి రాజు యాదవ్ మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న అరాచక, మోసపూరిత పాలనకు చరమగీతం పాడతామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మునుగోడు గడ్డపై కాషాయ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి తెలంగాణ ప్రజల అభ్యున్నతి కోసం ఒక సైనికుడిలా పనిచేస్తానన్నారు. ముఖ్యంగా వెనకబడిన వర్గాల (ఓ.బి.సి) సంక్షేమం కోసం, పేదల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అలుపెరగని పోరాటం చేస్తానని చెప్పారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తూ, నాయకత్వం అప్పగించిన ప్రతి బాధ్యతను క్రమశిక్షణతో నెరవేరుస్తానని రాజు యాదవ్ పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచంద్ర రావు గారికి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఆనంద్ గౌడ్ గారికి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్ గారికి, డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గారికి, ముఖ్య నేత డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి గారికి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి గారికి, మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి గారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# సైబరాబాద్‌లో భారీ సైబర్ మోసం ముఠా అరెస్ట్



- **విషింగ్, సిమ్-స్వాప్, మాల్వేర్ ఫోన్లతో రూ. 77.75 లక్షల మోసం వెలుగులోకి**

సైబరాబాద్ వెలుతురు మే 16: సైబరాబాద్ సీసీపీఎస్ పరిధిలో అంతర్రాష్ట్ర సైబర్ మోసాల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. సిటీబ్యాంక్ ప్రెస్టీజ్ క్రెడిట్ కార్డ్ విభాగం అధికారులమంటూ బాధితులను నమ్మబలికి మోసం చేసినట్లు వెల్లడించారు. టెలికాం శాఖ (DoT) వెరిఫికేషన్ పేరుతో ఈసిమ్‌ను ఫిజికల్ సిమ్‌గా మార్చేలా ప్రేరేపించి, అనంతరం మాల్వేర్ ఇన్‌స్టాల్ చేసిన మొబైల్ ఫోన్ల ద్వారా OTPలను దొంగిలించినట్లు తెలిపారు. ఈ విధంగా బ్యాంకింగ్ వివరాలకు అనధికారిక యాక్సెస్ పొంది ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా భారీగా నగదు మోసం చేసినట్లు గుర్తించారు. మొత్తం రూ. 77.75 లక్షల మోసం జరిగినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు అధికారులు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని నిందితుల నివాసాల నుంచి రూ. 15 లక్షల నగదు రికవరీ చేసినట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, సిమ్ కార్డులు, సిటీబ్యాంక్ లేబుల్స్, మోటోరోలా స్టిక్కర్లు తదితర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ప్రజలు తెలియని వ్యక్తులతో OTPలు, బ్యాంకింగ్ వివరాలు, సిమ్ సంబంధిత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు.



# విటమిన్ ఎ అతిగా వద్దు



ఎంత మంచిదైనా అతి పనికిరాదు. ఇది విటమిన్ ఎ మోతాదుకు అతికినట్టు సరిపోతుంది. కళ్లు, రోగనిరోధక వ్యవస్థ, శరీరంలోని చాలా అవయవాల ఆరోగ్యానికి విటమిన్ ఎ తోడ్పడుతుంది. కానీ మరీ అతిగా తీసుకుంటే కాలేయ సమస్యల వంటి వాటికి దారితీస్తుంది. మన శరీరం సహజంగానే విటమిన్ ఎ నిల్వ చేసుకుంటుంది. అందువల్ల దీన్ని మరింత ఎక్కువగా పోగుపడేలా చేయటం మంచిది కాదు. ఇది మితిమీరితే తలనొప్పి, వికారం, తల తిప్పటం, కాలేయం దెబ్బతినటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. విటమిన్ ఎ రూపమైన బీటా-కెరటిన్ మాత్రలను పెద్ద మొత్తంలో తీసుకుంటే కాలేయ క్యాన్సర్‌కూ దారితీయొచ్చు. ముఖ్యంగా పొగ తాగేవారికి, పొగ అలవాటుండి మానేసినవారికి, ఆస్‌బెస్టాస్ ప్రభావానికి గురయ్యేవారికి దీని ముప్పు ఎక్కువ. అందువల్ల సురక్షితంగా విటమిన్ ఎ లభించేలా చూసుకోవటమే ఉత్తమం. ఇందుకు ఆహారమే మార్గం. చేపలు, పాలకూర, క్యారెట్లు, అప్రికాట్లతో ఇది దండిగా లభిస్తుంది. ఆకుపచ్చ, నారింజ, పసుపు రంగుల్లో ఉండే కూరగాయలు, పండ్లు తినటం మంచిది. సాధారణంగా డాక్టర్లు మాత్రల కన్నా ఆహారానికే తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఒకవేళ మాత్రలు వేసుకోవటం తప్పనిసరైతే సిఫారసు చేసిన మోతాదులకు కట్టుబడి ఉండాలి.



VITAMIN A

# కట్లెట్.. భలేభలే!

మనలో చాలామందికి చిరుతిళ్లంటే బోల్డంత ఇష్టం. అయితే వాటిలో బజ్జీ, పకోడీ లాంటివి కడుపుబ్బరం కలిగించి చిరాకు పెడతాయి. ఆ ఇబ్బంది లేకుండా తేలిగ్గా జీర్ణమయ్యే స్నాక్స్ కూడా అనేకం ఉన్నాయి. ఎంచక్కా ఎంజాయ్ చేయండి.

**కావలసినవి:**

అటుకులు కప్పు,
చిలకడదుంపలు 2,
ఉల్లిపాయ 1,
పచ్చిమిర్చి 2,
అల్లం తురుము స్పూన్,
కొత్తిమీర తరుగు 2 టేబుల్ స్పూన్లు,
కారం అర స్పూన్,
ఉప్పు తగినంత,
జీలకర్ర పొడి అర స్పూన్,
గరం మసాలా,
మిరియాల పొడి పావు స్పూన్ చొప్పున,
నిమ్మరసం స్పూన్,
బ్రెడ్ పౌడర్ అర కప్పు,
నూనె వేయించడానికి సరిపడా

**తయారీ:**

అటుకులను కడిగి నీళ్లు వంపేసి పక్కనుంచాలి. చిలకడదుంపలను ఉడికించి పొట్టు తీసి మెత్తగా మెదపాలి. అందులో నానబెట్టిన అటుకులు, తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, మిరియాల పొడి, అల్లం తురుము, జీలకర్ర పొడి, కొత్తిమీర, కారం, ఉప్పు, నిమ్మరసం, గరం మసాలా వేసి కలపాలి. ఈ మిశ్రమంతో కట్లెట్లు చేసుకోవాలి. వాటిని బ్రెడ్ పౌడర్‌లో ముంచి తీసి.. కాగుతున్న నూనెలో మధ్యస్థమైన సెగ మీద రెండు వైపులా బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. వేడివేడిగా టొమాటో సాస్ లేదా పుదీనా చట్నీతో సర్వ్ చేయండి. ఈ పోహా కట్లెట్లు బయట కరకరలాడుతూ లోపల మృదువుగా ఉండి చాలా రుచిగా ఉంటాయి.





# ఉప్పగా ఎందుకు?


కృష్ణమ్మ, గోదావరమ్మ నదుల నీళ్లు తాగితే భలేగా ఉంటాయి. కానీ అదే నదులన్నీ వెళ్లి కలిసే సముద్రం నీళ్లు మాత్రం నోట్లో పోసుకోలేనంత ఉప్పగా ఉంటాయి. ఎందుకో తెలుసా? దాని వెనక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. అదేంటో తెలుసుకుందామా!

ఆకాశం నుంచి వచ్చే వాన చినుకులు నేల మీద పడగానే రాళ్లలో, మట్టిలో దాక్కున్న ఉప్పును( ఖనిజ లవణాలు) చక్కిలిగింతలు పెట్టి వాటితో కలిపేసుకుంటాయి. తరవాత నదులు ఈ వాన నీటిని మోసుకుంటూ సముద్రం వైపు బయలుదేరుతాయి. నదుల్లో లవణాలు ఉన్నా, ప్రవహించే నీరు కాబట్టి అది మనకు అస్సలు తెలియదు. అందుకే ఆ నీటి రుచి తీయగా ఉంటుంది. నదులు తెచ్చిన నీళ్లన్నీ సముద్రం అనే ఒక పెద్ద గిన్నెలోకి వెళ్తాయి. ఇప్పుడు అసలైన మ్యాజిక్ జరుగుతుంది! పైన ఉన్న సూర్యుడు తన వేడి కిరణాలతో సముద్రపు నీటిని తాగుతాడు. అదే నేస్తాలూ..! నీరంతా ఆవిరి అవుతుంది కదా. కానీ సూర్యుడు నీటిని మాత్రమే ఆవిరి రూపంలో పైకి తీసుకెళ్తాడు. నదులు తెచ్చిన లవణాలు సముద్రం అడుగునే నిల్వ అవుతూ ఉంటాయి. ఈ ప్రక్రియ కొన్ని కోట్ల సంవత్సరాల నుంచి జరుగుతూనే ఉంది కాబట్టి.. ఆ ఉప్పంతా సముద్రంలోనే పేరుకుపోయి, అది ఉప్పగా తయారైంది. మరి సముద్రం నీరు ఎందుకు తీయగా అవ్వదు? అనేగా మీ ప్రశ్న? ఎందుకంటే సముద్రం నుంచి నీరు బయటికి వెళ్లడానికి వేరే దారి లేదు, కేవలం ఆవిరి అవ్వడం తప్ప! అందుకే నదులు తెచ్చిన మంచి నీరంతా ఆవిరి అవుతుంది.. అందులోని ఉప్పు మాత్రం అక్కడే ఉండిపోతుంది. చూశారా నేస్తాలూ! ప్రకృతి చేసే ఈ మ్యాజిక్ వల్లే మనకు సముద్రం నీరు ఉప్పగా అనిపిస్తుంది!



# ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ

- రూ.650 కోట్లతో సంగారెడ్డిలో భారీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- 44 ఎకరాల్లో కెజేఎస్ ఇండియా యూనిట్–II నిర్మాణం
- ప్రత్యక్షంగా 1500 మందికి ఉద్యోగ అవకాశాలు
- పరోక్షంగా 5 వేల మందికి ఉపాధి కల్పన
- వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలే ప్రభుత్వ లక్ష్యం
- జహీరాబాద్‌ను అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతాం
- ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు
- రైతు ఉత్పత్తులకు విలువ పెంచే పరిశ్రమలకు ప్రోత్సాహం
- యువత నైపుణ్యాలతో తెలంగాణను శక్తివంతం చేస్తాం
- మరిన్ని పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి










**సంగారెడ్డి వెలుతురు మే 16:** సంగారెడ్డి జిల్లాలో భారీ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తోగారపల్లి గ్రామ శివారులో కెజేఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్-II కు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1500 మందికి, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు మంత్రులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో భారీ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌లు ఏర్పాటుకానున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 9 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఎదుగుతున్న నేపథ్యంలో తెలంగాణ కూడా ఈ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా దుకెళ్తోందన్నారు. జహీరాబాద్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని నిమ్జ్‌ను అతిపెద్ద పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని యువత నైపుణ్యాలను వినియోగించుకొని తెలంగాణను మరింత శక్తివంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో విలువ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. వరి, పాలు, పండ్లు, కూరగాయలు, పసుపు ఉత్పత్తుల్లో తెలంగాణ ముందంజలో ఉందని, వీటికి విలువను పెంచే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు రైతులకు, యువతకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అతిపెద్ద పారిశ్రామిక వాడగా పటాన్‌చెరు గుర్తింపు పొందిందన్నారు. అదే తరహాలో వెనుకబడిన ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ఇంత పెద్ద స్థాయిలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న కెజేఎస్ ఇండియా యాజమాన్యాన్ని అభినందించారు. పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తే స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టీజీఐఐసీ చైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, టీజీఐఐసీ ఎండీ శశాంక్, మాజీ ఎమ్మెల్యే జయప్రకాశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రాబర్ట్ వాద్రాకు భారీ ఊరట



- షిఖోపూర్ భూముల కేసులో ఢిల్లీ కోర్టు ముందస్తు బెయిల్!
- రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో పెద్ద ఉపశమనం.
- అదనపు షరతులు లేకుండా రూ.50 వేల పూచీకత్తుతో ముందస్తు బెయిల్
- ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌పై విచారణకు సంబంధించి కోర్టు సమన్లు
- వ్యక్తిగతంగా విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా.
- కేసు వివరాల సమర్పణకు సమయం కోరిన ఈడీ
- విచారణను జూలై 10కి వాయిదా వేసిన కోర్ట్
- నిబంధనల ప్రకారం దర్యాప్తు సంస్థల విచారణ
- సహకరిస్తానని, న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందన్న వాద్రా
- కేసు చట్టబద్ధతను సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన రాబర్ట్ వాద్రా

**ఢిల్లీ వెలుతురు మే 16:** ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు దిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక న్యాయస్థానంలో పెద్ద ఊరట లభించింది. హరియాణాలోని షిఖోపూర్ భూముల వ్యవహారానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఆయనకు కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇటీవల దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకుంటూ వాద్రాకు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది.

**రూ.50 వేల పూచీకత్తుతో బెయిల్**

రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఈ కేసును విచారించారు. వాద్రాకు ముందస్తు బెయిల్ ఇస్తూనే, రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని ఆదేశించారు. అయితే ఆయనపై ఎలాంటి అదనపు కఠిన షరతులను న్యాయస్థానం విధించలేదు. ఇదే సమయంలో ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను, నివేదికను కోర్టుకు సమర్పించడానికి తమకు మరింత వ్యవధి కావాలని ఈడీ తరపు న్యాయవాదులు కోరారు. దర్యాప్తు సంస్థ అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం, తదుపరి విచారణను జూలై 10వ తేదీకి వాయిదా వేసింది. కోర్టులో వాద్రా తరఫున సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్, లాయర్లు ప్రతీక్ చద్దా, అక్షత్ గుప్తాలు హాజరై గట్టిగా వాదనలు వినిపించారు.

**న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది: రాబర్ట్ వాద్రా**

కోర్టు బెయిల్ మంజూరు చేసిన అనంతరం రాబర్ట్ వాద్రా సంతోషంగా బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. దేశంలో ఉన్న చట్టాలు, న్యాయవ్యవస్థపై తనకు మొదటి నుంచి పూర్తి విశ్వాసం ఉందని ఆయన స్పష్టం చేశారు. "నేను ఎలాంటి తప్పు చేయలేదు. నా జీవితంలో దాచాల్సింది ఏమీ లేదు. దర్యాప్తు సంస్థలు ఎప్పుడు పిలిచినా నేను విచారణకు వెళ్లాను, ముందూ సహకరిస్తాను. ఈడీ సంస్థ అంతా కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారమే నడుస్తోందనే భావన ఈరోజు దేశ ప్రజల్లో బలంగా ఉంది. అయినప్పటికీ నేను చట్టాన్ని గౌరవిస్తాను. వారు అడిగే ప్రతి ప్రశ్నకు నా దగ్గర సరైన సమాధానాలు ఉన్నాయి" అని వాద్రా ధీమా వ్యక్తం చేశారు. తాను ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, ధైర్యంగా చట్టపరమైన పోరాటాన్ని కొనసాగిస్తానని పేర్కొన్నారు.

**దిల్లీ హైకోర్టులోనూ చట్టబద్ధతపై సవాల్**

మరోవైపు ఈ కేసు విషయమై ఒక రోజు ముందే దిల్లీ హైకోర్టులో కూడా కీలకమైన పరిణామాలు జరిగాయి. ట్రయల్ కోర్టు (రౌస్ అవెన్యూ) ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను విచారణకు స్వీకరించడాన్ని సవాల్ చేస్తూ వాద్రా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై వాద్రా తరఫున దేశంలోనే ప్రముఖ సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఈ కేసులో మోపిన ఆరోపణలన్నీ 2008 నుంచి 2012 మధ్య కాలానికి సంబంధించినవని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. అప్పట్లో ఆయా భూ లావాదేవీల అంశాలు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) పరిధిలోకి రావని, ఆ తర్వాతే ప్రభుత్వం చట్టాన్ని సవరించి వాటిని చేర్చిందని వివరించారు. చట్టం ప్రకారం పాత కేసులపై కొత్త నిబంధనలు వర్తింపజేయడం కుదరదని, అందుకే ఈ కేసు చట్టబద్ధతపైనే తమకు అభ్యంతరాలు ఉన్నాయని సింఘ్వీ వాదించారు.

**ఈడీ అభ్యంతరాలు.. మే 18కి వాయిదా**

అయితే వాద్రా తరఫు లాయర్ల వాదనలను ఈడీ న్యాయవాది జొహెబ్ హుస్సేన్ తీవ్రంగా వ్యతిరేకించారు. వాద్రా కోర్టును తప్పుదోవ పట్టించేలా చట్టాన్ని అపార్థం చేసుకుని ఈ పిటిషన్ దాఖలు చేశారని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ జైన్, ఈ అంశంపై మరింత లోతుగా పరిశీలించాల్సి ఉందంటూ తదుపరి విచారణను మే 18వ తేదీకి వాయిదా వేశారు.

**అసలు ఏంటి ఈ షిఖోపూర్ భూముల వివాదం?**

ఈ వివాదం అంతా 2008 ఫిబ్రవరిలో జరిగిన ఒక భూ లావాదేవీ చుట్టూ తిరుగుతోంది. హరియాణాలోని గురుగ్రామ్ (గుర్‌గావ్) సమీపంలో ఉన్న షిఖోపూర్ గ్రామంలో దాదాపు 3.5 ఎకరాల భూమిని 'స్కైలైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్' అనే కంపెనీ కేవలం రూ. 7.5 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ సమయంలో ఈ స్కైలైట్ కంపెనీలో రాబర్ట్ వాద్రా ఒక ముఖ్యమైన డైరెక్టర్‌గా ఉన్నారు. ఆ తర్వాత కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే, అంటే 2012లో అదే భూమిని ప్రముఖ దేశీయ రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థ 'డీఎల్ఎఫ్' కు ఏకంగా రూ. 58 కోట్ల భారీ మొత్తానికి విక్రయించారు.

**ఈడీ అనుమానాలు.. లోతైన దర్యాప్తు**

చాలా తక్కువ కాలంలోనే ఆ భూమి విలువ అంత అసాధారణంగా, అనూహ్యంగా ఎలా పెరిగిందనే కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ప్రారంభించింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ భూమికి సంబంధించిన ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు అత్యంత వేగంగా రావడం వెనుక వాద్రా రాజకీయ ప్రభావం ఉందనేది ప్రధాన ఆరోపణ. అలాగే భూమి యాజమాన్య హక్కుల మార్పిడి (మ్యూటేషన్ ప్రక్రియ) కూడా చకచకా జరిగిపోవడంపై ఈడీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఈ మొత్తం లావాదేవీలు కేవలం అక్రమ సంపాదనను చేతులు మార్చడానికి, మనీలాండరింగ్‌కు పాల్పడటానికే జరిగాయని ఈడీ గట్టిగా వాదిస్తోంది. ఈ వ్యవహారంలో మరికొన్ని పెద్ద సంస్థలు, కీలక వ్యక్తుల పాత్ర కూడా ఉందని, అందరిపై సమగ్ర విచారణ జరపాల్సి ఉందని కోర్టుకు తెలిపింది. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి నివేదికను తమ ముందు ఉంచాలని ఈడీని కోర్టు ఆదేశించింది.

## విశాఖ మధురవాడకు మహర్దశ.. రూ. 1,501 కోట్లతో మెగా ప్రాజెక్టులు!




- కేంద్ర ప్రభుత్వ 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' కింద గ్రేటర్ విశాఖకు రూ. 375.26 కోట్ల భారీ గ్రాంట్ మంజూరు.
- సీఎం చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ప్రతిపాదనలకు దిల్లీలో లభించిన తుది ఆమోదం.
- మధురవాడ జోన్‌లో మురుగునీటి సమస్యల పరిష్కారం, తాగునీటి సరఫరా మెరుగుదలే ప్రధాన లక్ష్యం.
- రూ. 658.61 కోట్లతో 21,800 ఇళ్లకు భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ) కనెక్షన్ల లభ్యత.
- మధురవాడ పరిధిలోని 37,000 కుటుంబాలకు రూ. 725.18 కోట్లతో 24 గంటల తాగునీటి సరఫరా.
- నీటి సరఫరాలో వృథాను అరికట్టేందుకు అత్యాధునిక స్మార్ట్ మీటర్లు, వాల్యూమెట్రిక్ టారిఫ్ విధానం అమలు.

విశాఖపట్నం వెలుతురు మే 16: విశాఖపట్నంలో అత్యంత వేగంగా విస్తరిస్తూ, ఐటీ మరియు అనేక కొత్త కంపెనీల స్థాపనకు కేంద్రీకృతంగా మారుతున్న 'మధురవాడ జోన్' ఇప్పుడు సరికొత్త అభివృద్ధి స్వర్ణయుగానికి సిద్ధమవుతోంది. ఈ ప్రాంతంలో సుదీర్ఘకాలంగా ఉన్న మురుగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు, అత్యాధునిక పద్ధతుల్లో 24 గంటల తాగునీటి సరఫరాను అందించేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ పట్టణ అభివృద్ధి పథకాల కింద జీవీఎంసీ ఈ భారీ మొత్తంలో మౌలిక సదుపాయాల పెట్టుబడులను సాధించడంలో విజయం సాధించింది. నగరవ్యాప్తంగా నీటి వృథాను అరికట్టడానికి ఒకే కేంద్రం నుంచి పర్యవేక్షించే అత్యాధునిక వ్యవస్థను కూడా ఇందులో భాగంగా ప్రవేశపెడుతున్నారు.

**అర్బన్ ఛాలెంజ్ ఫండ్స్ కింద నిధుల కేటాయింపు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక మార్గదర్శకత్వంలో ఏర్పడిన ఒక ఉన్నత స్థాయి రాష్ట్ర కమిటీ ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను నిశితంగా సమీక్షించింది. అనంతరం స్మార్ట్ సిటీ కార్పొరేషన్, జీవీఎంసీ సంయుక్తంగా సమర్పించిన మూడు కీలక ప్రతిపాదనలకు, ఇటీవల దిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర ప్రభుత్వం 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' (యూసీఎఫ్) కింద నిధుల కేటాయింపునకు తుది ఆమోదం తెలిపింది. దీని ఫలితంగా మొత్తం రూ. 1,501 కోట్ల విలువైన మూడు ప్రాజెక్టులకు గాను, కేంద్రం తన వాటాగా 25 శాతం గ్రాంటును అంటే రూ. 375.26 కోట్లను మంజూరు చేసింది. ఈ మూడు మెగా ప్రాజెక్టులను రాబోయే 2028 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టులు అమలు కానున్న ప్రాంతాల్లో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇటీవల స్వయంగా పర్యటించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.

**ప్రాజెక్టు-1: రూ. 658.61 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ**

మధురవాడ కారిడార్‌లో నివసిస్తున్న ప్రజల మురుగునీటి కష్టాలను తీర్చేందుకు రూ. 658.61 కోట్ల అంచనా వ్యయంతో ఒక సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థను (యూజీడీ) ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 21,800 గృహాలకు నేరుగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు లభిస్తాయి. ఇందుకోసం ఈ జోన్ పరిధిలో మొత్తం 401 కిలోమీటర్ల పొడవైన సరికొత్త మురుగునీటి పైప్‌లైన్లను వేయనున్నారు. దీంతో పాటు, అత్యాధునిక సాంకేతికత అయిన 'సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్స్' (ఎస్‌బీఆర్) ఆధారంగా పనిచేసే 20 ఎంఎల్డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) సామర్థ్యం గల ఒక భారీ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీ) కూడా ఇక్కడే నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తయితే మధురవాడ ప్రాంతంలో పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది.

**ప్రాజెక్టు-2: రూ. 725.18 కోట్లతో 24 గంటల తాగునీరు**

మధురవాడ జోన్‌లోని దాదాపు 37,000 కుటుంబాలకు నిరంతరాయంగా, రోజులో 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రూ. 725.18 కోట్లతో రెండో ప్రాజెక్టును చేపట్టనున్నారు. నీరు తక్కువ ఒత్తిడితో వచ్చే సమస్య లేకుండా ఉండేందుకు ఒక ప్రత్యేక ప్రెషరైజ్డ్ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను ఈ ప్రాంతంలో నిర్మిస్తారు. పైప్‌లైన్ లీకేజీలు, నీటి వృథాను వెంటనే గుర్తించి అరికట్టడానికి ప్రత్యేకంగా 'జిల్లా మీటరింగ్ ప్రాంతాలను' (డీఎంఏలు) ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 65 ఎంఎల్‌డి సామర్థ్యం గల ఒక సరికొత్త నీటి శుద్ధి కర్మాగారాన్ని (డబ్ల్యూటీపీ) కూడా నిర్మించనున్నారు. ప్రతి ఇంటికి 'అడ్వాన్స్‌డ్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' (ఏఎంఐ) కలిగిన స్మార్ట్ కనెక్షన్‌లను అమర్చనున్నారు. అంతేకాకుండా, నీటి వినియోగాన్ని క్రమబద్ధీకరించడానికి మరియు మున్సిపల్ ఆదాయాన్ని పెంచడానికి వాడిన నీటి పరిమాణాన్ని బట్టి బిల్లులు వసూలు చేసే 'వాల్యూమెట్రిక్ టారిఫ్' విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు.

**ప్రాజెక్టు-3: రూ. 117.24 కోట్లతో కేంద్రీకృత స్మార్ట్ వాటర్ సిస్టమ్**

నగర తాగునీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించేందుకు మూడో ప్రాజెక్టు కింద స్మార్ట్ టెక్నాలజీని అనుసంధానిస్తున్నారు. విశాఖ మొత్తం మీద బల్క్ మరియు సెమీబల్క్ ఆటోమేటెడ్ నీటి సరఫరా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి రూ. 117.24 కోట్లను కేటాయించారు. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్స్ ఆధారిత సాంకేతికతను ఉపయోగించుకుంటున్నారు. నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసే 7,857 మీటరింగ్ కనెక్షన్ల ద్వారా నీటి ప్రవాహం ఏ స్థాయిలో ఉందో క్షణక్షణం (రియల్ టైమ్) పర్యవేక్షించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత.

**స్కైడా వ్యవస్థతో లీకేజీలకు చెక్**

ఈ కొత్త 'స్కైడా' వ్యవస్థ అందుబాటులోకి వస్తే నగర నీటి సరఫరా విభాగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. నీటి వనరులు, శుద్ధి కర్మాగారాలు, ప్రధాన పైప్‌లైన్‌లు, మరియు నగరంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు అత్యాధునిక సెన్సార్లను అమర్చి, వాటన్నింటినీ ఒకదానితో ఒకటి అనుసంధానిస్తారు. ఈ సెన్సార్ల ద్వారా వచ్చే సమాచారం అంతా నేరుగా జీవీఎంసీలోని ఒక ప్రధాన కేంద్రీకృత నియంత్రణ గదికి (సెంట్రల్ కంట్రోల్ రూమ్) చేరుతుంది. దీనివల్ల నగరంలోని ఏ ప్రాంతంలో నీటి సరఫరా ఎలా జరుగుతుందో ఒకే చోటు నుంచి అధికారులు పర్యవేక్షించవచ్చు.

రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి మట్టాలు, నీటిని శుద్ధి చేసే సమయంలో కలపాల్సిన రసాయనాల మోతాదులు, పైప్‌లైన్లలో నీటి సరఫరా పీడనం (ప్రెషర్) వంటి కీలకమైన అంశాలను నిరంతరం పర్యవేక్షించే వీలు కలుగుతుంది. ఎక్కడైనా పైప్‌లైన్ పగిలి లీకులు ఏర్పడినా లేదా నీటి దొంగతనం జరిగినా ఈ వ్యవస్థ ద్వారా తక్షణమే గుర్తించి నష్టాన్ని నివారించవచ్చు. ఈ మెగా ప్రాజెక్టుల ద్వారా విశాఖ నగరం, ముఖ్యంగా మధురవాడ జోన్ మౌలిక సదుపాయాల కల్పనలో దేశంలోనే ఒక మోడల్ ప్రాంతంగా నిలవనుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com